www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -80 శనివారం 4 జులై 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# కేసీఆర్ పాలనలో అప్పు 8 లక్షల కోట్లు

**ఈ దోపిడీకి కారణం ఆయనే**

**అసెంబ్లీకి వచ్చి సమాధానం చెప్పాల్సిందే**

**కేటీఆర్, హరీశ్‌రావు స్థాయి ఏంటి?**

**కాంగ్రెస్ అప్పు రూ.1.77 లక్షల కోట్లు**

**బీఆర్ఎస్ అప్పులు, వడ్డీలు కలిపి రూ.2.08 లక్షల కోట్లు చెల్లించాం**

**అబద్ధాలతో విషప్రచారం ఇంకెంత కాలం**

**సింగరేణి బొగ్గుపై సమగ్ర నివేదిక ఇవ్వండి : విజిలెన్స్ డైరెక్టర్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి ఆదేశం**




**హైదరాబాద్ జూలై 03(ప్రజావినికిడి):** బీఆర్ఎస్ హయాంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన అప్పు రూ.8,21,651 కోట్లని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఈ అప్పులపై కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ దోపిడీకి కారణం ఆయనేనన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు సమాధానం చెప్పడానికి వారి స్థాయి ఏంటని ప్రశ్నించారు. ఎవరు ఏంటనేది ఇప్పటికే ప్రజలు నిర్ణయించారనీ, స్థాయి అనేది పుట్టుకను బట్టి రాదనీ, ప్రజాజీవితంలో పోషించే పాత్రను బట్టి వస్తుందని అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పదేండ్లపాటు అధికారంలో ఉండి, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్, హరీశ్‌రావు అప్పులపై అబద్ధ పు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. 2014 నుంచి 2023 వరకు రూ.8,21,651 కోట్ల అప్పు చేస్తే కేటీఆర్ మాత్రం రూ.2.78 లక్షల కోట్ల అప్పు చేశామని చెప్పడం సరైంది కాదన్నారు. అబద్ధాలను ప్రచార అస్త్రాలుగా మార్చుకుని, 'గోబెల్స్' ప్రచారానికి పాల్పడుతున్నారని దుయ్య బట్టారు. అబద్ధాల పునా దుల మీద ఏ ఆర్థిక వ్యవస్థను నిర్మించలేమనీ, వాస్తవాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. **మిగతా 2లో...**

# ఎస్ఐఆర్ నిలిపేయండి..

**సుప్రీంకోర్టుకు 23 మంది విపక్ష నేతల లేఖ**

**ఓటర్ల తొలగింపుపై తీవ్ర అభ్యంతరం**

**ఈవీఎంలపై ప్రజా చర్చ కోరిన విపక్షాలు**

**కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణ**

**ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని వ్యాఖ్య**




**న్యూఢిల్లీ, జూలై 03(ప్రజావినికిడి):** దేశ ఎన్నికల ప్రక్రియపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తూ విపక్షాలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశాయి. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరాయి. ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు ఏర్పడిందని ఆరోపించాయి.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు 23 మంది విపక్ష నేతలు ఈ లేఖపై సంతకం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజల అసలు తీర్పు ప్రతిబింబించడం లేదని ఆరోపించారు. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల**మిగతా 2లో...**

# గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పవన్ కల్యాణ్ భేటీ



**వివిధ అంశాలపై గవర్నర్ తో ఫలప్రదమైన చర్చ జరిగిందని వెల్లడించిన పవన్**

**అంతకుముందు సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణతో సమావేశం**

**గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై 'ఈగల్' విభాగం నివేదిక సమర్పణ**

**సోషల్ మీడియా వేధింపులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఐజీ వెల్లడి**



**అమరావతి జూలై 03(ప్రజావినికిడి):** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుక్రవారం నాడు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సాయంత్రం పవన్ విజయవాడలోని లోక్ భవన్ కు వెళ్లారు. ఈ భేటీ చాలా ఆత్మీయంగా, ఫలప్రదంగా జరిగిందని పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా తెలిపారు. పలు అంశాలపై ఇరువురూ చర్చించుకున్నారని, గవర్నర్ మార్గదర్శకత్వం, ఆతిథ్యం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. **2లో...**

# ఏపీ హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తులు..

**కేంద్రం ఉత్తర్వులు**

**నియామకాలకు రాష్ట్రపతి ఆమోదం**

**మే 4న పేర్లు ఖరారు చేసిన కొలీజియం**

**కేంద్రం పరిశీలన తర్వాత ఉత్తర్వులు**



**న్యూఢిల్లీ,జూలై 03(ప్రజావినికిడి):** ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్రపతి ఆమోదంతో నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ వెల్లడించారు.

అదనపు న్యాయమూర్తులుగా సునీత గంధం, ఆలపాటి గిరిధర్, పురుషోత్తం కుమార్ చింతలపూడి నియమితులయ్యారు. **మిగతా 2లో...**

# కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు

**మీడియా,కమ్యూనికేషన్ నోడల్ అధికారులతో భేటీ**

**తెలంగాణ సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారుల హాజరు**




**న్యూఢిల్లీ,జూలై 03(ప్రజావినికిడి):** భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన ఒకరోజు మీడియా / కమ్యూనికేషన్ నోడల్ అధికారుల జాతీయ సదస్సులో తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖకు చెందిన జిల్లా పౌర సంబంధాల అధికారులు, మీడియా నోడల్ అధికారులు, సోషల్ మీడియా నోడల్ అధికారులు పాల్గొన్నారు. దేశంలోని 15 రాష్ట్రాలు, కేంద్ర **మిగతా 2లో...**

# సవాల్‌పై కట్టుబడి ఉన్నందునే వచ్చా

**ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్న జూపల్లి**

**అబద్దాల లేఖలతో ప్రచారం చేస్తున్న హరీష్ రావు**

**బిఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ మంత్రి**



**హైదరాబాద్, జూలై 03(ప్రజావినికిడి):** తెలంగాణ అప్పులపై సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో చర్చకు సిద్ధమని ప్రకటించిన మంత్రి జూపల్లి కృష్ణారావు సాయంత్రిం ప్రెస్‌క్లబ్‌కు వచ్చారు. శుక్రవారం ఉదయం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌కు ఆయన సవాల్ విసిరారు. సాయంత్రం 5 గంటలకు సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు వస్తానని చెప్పారు. ఈ మేరకు మంత్రి జూపల్లి శుక్రవారం సాయంత్రం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు చేరుకున్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. సవాల్‌పై **మిగతా 2లో...**

# అప్పులపై అబద్దాలు

**పూటకో మాట.. రోజుకో అడ్రస్‌లా జూపల్లి తీరు**

**విమర్శలు గుప్పించిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు**



**సంగారెడ్డి, జూలై 03(ప్రజావినికిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేసిన అప్పుల విషయంలో అబద్దాలు చెప్తున్నదని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన ఎస్ఐఆర్ పై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. తెలంగాణ ఏర్పడిన తరువాత రాష్ట్రంలో చేసిన అప్పు రూ. 1,77,058 కోట్లు అని మంత్రి జూపల్లి కృష్ణారావు నాకు లేఖ రాశాడు. కానీ రేవంత్ రెడ్డి నాలుగు నెలల క్రితం అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.3,45,294 కోట్లు అని చెప్పాడు. నాలుగు నెల కిందనే నిండు అసెంబ్లీలో రేవంత్ రెడ్డి అంత చెప్పాడు అంటే ఈ నాలుగు నెలలది కూడా కలిపితే రూ. 4 లక్షల**మిగతా 2లో...**

# రుషికొండ ప్రాజెక్టును అభివృద్ధికి చర్యలు

**ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ తరహాలో అప్పగింత**

**ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి అవకాశం**




**అమరావతి జూలై 03(ప్రజావినికిడి):** రుషికొండ భవనాల విషయంలో ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్(ఏపీటీడీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. హిల్‌టాప్‌లోని భవనాల నిర్వహణ, ఆపరేషన్, మార్కెటింగ్ కోసం ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటెస్ట్ ను ఆహ్వానిస్తూ ప్రకటన విడుదల చేసింది.**మిగతా2లో...**

# అమర్‌నాథ్ యాత్రికులకు మోడీ శుభాకాంక్షలు

**యాత్రలో పాల్గొనడం గొప్ప అనుభూతిగా వెల్లడి**

**యాత్రలో జాగ్రత్తలు పాటించాలంటూ ఎక్స్ వేదికగా పిలుపు**



**న్యూఢిల్లీ, జూలై 03(ప్రజావినికిడి):** అమర్‌నాథ్ యాత్రను పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ భక్తులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర యాత్రను ఒక 'గొప్ప భాగ్యం'గా అభివర్ణించిన ప్రధాని, భక్తి శ్రద్ధలతో, క్రమశిక్షణతో, బాధ్యతాయుతమైన జాతీయ భావనతో భక్తులు ఈ ప్రయాణాన్ని కొనసాగించాలని కోరారు. శివభక్తులను ఉద్దేశించి రాసిన లేఖను ఎక్స్ వేదికగా పంచుకుంటూ మోదీ పలు కీలక విషయాలను ప్రస్తావించారు.'పవిత్రమైన అమర్‌నాథ్ యాత్రలో పాల్గొనడం ఒక గొప్ప భాగ్యం. ప్రతి సంవత్సరం మంచు లింగంని నేరుగా దర్శించుకునే ఈ అవకాశం లక్షలాది మంది శివభక్తులకు అత్యంత పవిత్రమైన, మరపురాని**మిగతా 2లో...**

# ఎస్ఐఆర్ నిలిపేయండి..

మొదటిపేజీ తరువాయి

సూత్రాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు.ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ రాజకీయ ఉద్దేశాలతో జరుగుతోందని విపక్షాలు ఆరోపించాయి. సరైన పత్రాలు లేని పేదలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల ఓటు హక్కు ప్రమాదంలో పడుతోందని పేర్కొన్నాయి. లక్షలాది మంది నిజమైన ఓటర్లు జాబితాల నుంచి తొలగింపునకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశాయి.పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో 27 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించారని లేఖలో పేర్కొన్నారు. 'లాజికల్ డిస్క్రిపెన్సీస్' పేరుతో ఈ తొలగింపులు జరిగాయని తెలిపారు. ఒక న్యాయ ట్రిబ్యునల్ పరిశీలించిన 1,777 కేసుల్లో 1,717 తొలగింపులు తప్పుగా జరిగాయని గుర్తించినట్లు వెల్లడించారు.ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై కూడా ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయని విపక్షాలు తెలిపాయి. అవసరమైతే బ్యాలెట్ పేపర్ విధానాన్ని తిరిగి పరిశీలించాలని సూచించాయి. దీనిపై విస్తృత ప్రజా చర్చ జరగాలని కోరాయి.సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను విపక్షాలపై రాజకీయ అస్త్రాలుగా ఉపయోగిస్తున్నారని ఆరోపించాయి. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేలా వ్యవస్థలను వినియోగిస్తున్నారని పేర్కొన్నాయి.రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత సుప్రీంకోర్టుదేనని లేఖలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తక్షణ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని సుప్రీంకోర్టును కోరారు.

# గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో పవన్ కల్యాణ్ భేటీ

మొదటిపేజీ తరువాయి

అంతకుముందు, పవన్ కల్యాణ్ మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో 'ఈగల్' విభాగం చీఫ్, సైబర్ క్రైమ్ ఐజీ ఆకే రవికృష్ణతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈగల్ విభాగానికి సంబంధించిన వార్షిక నివేదికను ఐజీ, పవన్‌కు అందజేశారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, సాధించిన ఫలితాలను నివేదికలో పొందుపరిచారు.అలాగే, సోషల్ మీడియాలో జరుగుతున్న వేధింపులు, ట్రోలింగ్, ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై సైబర్ క్రైమ్ విభాగం తీసుకుంటున్న కఠిన చర్యల గురించి పవన్ కల్యాణ్‌కు వివరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది.

## ఏపీ హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తులు..

మొదటిపేజీ తరువాయి

భారత ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపుల అనంతరం రాష్ట్రపతి ఈ నియామకాలు చేపట్టినట్లు కేంద్రం తెలిపింది.ఈ ముగ్గురి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం ఈ ఏడాది మే 4న జరిగిన సమావేశంలో ఆమోదించింది. అనంతరం నియామక ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలించింది.హైకోర్టు న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో ముందుగా సంబంధిత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పేర్లను ప్రతిపాదిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం వాటిని కేంద్రానికి పంపిస్తుంది. అనంతరం కేంద్రం పరిశీలించి ప్రధాన న్యాయమూర్తి అభిప్రాయం తీసుకుంటుంది. అన్ని దశలు పూర్తైన తర్వాత రాష్ట్రపతి నియామక ఉత్తర్వులపై సంతకం చేస్తారు. అనంతరం కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తుంది.

# రుషికొండ ప్రాజెక్టును అభివృద్ధికి చర్యలు

మొదటిపేజీ తరువాయి

లీజ్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ మోడల్‌లో రుషికొండ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి అవకాశం కల్పించనుంది. ఎంపికైన ప్రైవేట్ సంస్థ.. ఐదు భవనాల సముదాయాన్ని నిర్వహించనుంది. మొత్తం 9.8 ఎకరాల హిల్‌టాప్ ప్రాజెక్టును మోడల్‌లో ప్రభుత్వం వినియోగించనుంది. రుషికొండ దిగువ ప్రాంతంలో ఉన్న మరో 9 ఎకరాల భూమి అభివృద్ధికి కూడా అవకాశం కల్పించనుంది. హోటళ్లు, రిసార్టులు, పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఏపీటీడీసీ తెలిపింది. సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండే వ్యూయింగ్ ఏరియాలు, ఓపెన్ స్పేస్‌లు తప్పనిసరిగా ఉండేలా నిబంధనలు విధించింది. ప్రస్తుత భవనాలతో పాటు అదనపు అభివృద్ధికి కూడా ప్రభుత్వం అవకాశం కల్పించింది. రెండు ఖాళీ స్థలాల్లో మొత్తం 2,400 చదరపు మీటర్ల విస్తీర్ణంలో అభివృద్ధికి అవకాశం ఉండగా, అదనంగా సుమారు 4,800 చదరపు మీటర్ల వరకు జీప్లస్ 1 నిర్మాణాలకు అనుమతి ఇవ్వనుంది. సీఆర్‌జెడ్ నిబంధనలు, చట్టబద్ధ అనుమతుల ప్రకారమే అన్ని నిర్మాణాలు చేపట్టాలని ఏపీటీడీసీ స్పష్టం చేసింది. పెట్టుబడిదారుల ఆసక్తి, ప్రాజెక్టు వాణిజ్య సాధ్యాసాధ్యాలను ఇక్షఎ ద్వారా అంచనా వేసి... అనంతరం ఆర్ఎఫ్‌పీ దశలో తుది ఎంపిక పక్రియ జరగనుంది. హోటల్ చైన్లు, రిసార్ట్ డెవలపర్లు, ఇన్‌ఫ్రాస్టక్చర్ కంపెనీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీటీడీసీ వెల్లడించింది. హాస్పిటాలిటీ రంగంలో అనుభవం ఉన్న సంస్థలకే అర్హత
కల్పించనున్నట్లు తెలిపింది. మార్చి 31, 2025 నాటికి పాజిటివ్ నెట్‌వర్త్ తప్పనిసరి అని పేర్కొంది. ఇక్షఎ దాఖలుకు చివరి తేదీ జులై 10 సాయంత్రం 5 గంటలుగా నిర్ణయించారు. తుది లీజ్ నిబంధనలు, ఆదాయ భాగస్వామ్యం తదితర అంశాలను ఖీఈఖ దశలో ఖరారు చేయనున్నట్లు ఏపీటీడీసీ వెల్లడించింది.

## అమర్‌నాథ్ యాత్రికులకు మోడీ శుభాకాంక్షలు

మొదటిపేజీ తరువాయి

అనుభూతిని ఇస్తుంది. ఈ సంవత్సరం యాత్రకు సిద్ధమవుతున్న భక్తులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు.' అని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఈ యాత్ర భారతదేశ ఆధ్యాత్మిక సంప్రదాయంలో ఒక శాశ్వతమైన అధ్యాయమని ప్రధాని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా సనాతన సంస్కృతిని అనుసరించే లక్షలాది మంది భక్తులు ప్రతి ఏటా బాబా అమర్‌నాథ్ ఆశీస్సుల కోసం జమ్మూ కశ్మీర్‌కు వస్తుంటారని గుర్తుచేశారు. వివిధ ప్రాంతాలు, విభిన్న భాషలు, భిన్నమైన ఆచారాలు ఉన్నప్పటికీ.. మహాదేవుని ఆశీస్సులు పొందాలనే ఒకే ఒక సంకల్పంతో భక్తులంతా ఇక్కడికి తరలివస్తారని, ఈ రెండు నెలల కాలంలో బాబా బర్ఫానీ పవిత్ర సన్నిధిలో భారతదేశ 'భిన్నత్వంలో ఏకత్వం' అనే అద్భుత దృశ్యం ఆవిష్కృతమవుతుందని మోదీ అన్నారు. ఈ యాత్ర సజావుగా సాగడానికి అహర్నిశలు శ్రమిస్తున్న భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూ కశ్మీర్ పోలీస్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు ఆరోగ్య కార్యకర్తలు, పరిపాలనా అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, వాలంటీర్లకు ప్రధాని మోదీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది యాత్ర సందర్భంగా భక్తులందరూ తమ జీవితంలో ఐదు ముఖ్యమైన సంకల్పాలను స్వీకరించాలని ప్రధాని పిలుపునిచ్చారు. అమర్‌నాథ్ యాత్ర మార్గంలో ఎక్కడా చెత్తాచెదారం వేయకుండా, పరిశుభ్రత నియమాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. వాతావరణ మార్పులు, వర్షాల నేపథ్యంలో జారే మార్గాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, పరిపాలనా యంత్రాంగం ఇచ్చే ఆదేశాలను, ట్రాఫిక్ నిబంధనలను, భద్రతా సూచనలను పూర్తిగా అంకితభావంతో పాటించాలని సూచించారు. స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు, యాత్రికులు తమ ప్రయాణ ఖర్చులలో కనీసం 10 శాతం మొత్తాన్ని జమ్మూ కశ్మీర్‌లోని స్థానిక ఉత్పత్తులను కొనుగోలుకు కేటాయించాలి. ఇది అక్కడి కుటుంబాలకు, యువతకు ఉపాధినిస్తుందన్నారు. రక్షాబంధన్ పండుగతో ముగిసే ఈ యాత్ర ముగింపు సందర్భంగా.. 'ఏక్ పేడ్ మా కే నామ్' అమ్మ పేరిట ఒక మొక్క ప్రచారంలో భాగంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలన్నారు. దేశమే ప్రథమమనే భావనతో, మన బాధ్యతలను ఏడాది పొడవునా నిజాయితీగా నిర్వర్తిస్తూ, 'వికసిత్ భారత్' నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలి. చివరగా, భక్తులందరి ప్రయాణం సుఖమయంగా, సురక్షితంగా, ఆధ్యాత్మికంగా సాగాలని ప్రధాని ఆకాంక్షించారు.

# అప్పులపై అబద్ధాలు

మొదటిపేజీ తరువాయి

కోట్లు దాటుతుందన్నారు. జూపల్లి ఒక మాట చెబుతున్నాడు, రేవంత్ రెడ్డి ఇంకో మాట చెబుతున్నాడు. ఇప్పుడు రాజీనామా ఎవరు చేయాలి? అని హరీశ్ రావు సూటిగా ప్రశ్నించాడు. పూటకో సవాల్.. రోజుకో అడ్రస్‌లా మంత్రి జూపల్లి కృష్ణారావు తీరు ఉందని హరీశ్‌రావు విమర్శించారు. మంత్రి జూపల్లి సవాళ్లు నిన్నే చూశాం.. ఏమైందో అందరికీ తెలుసు. తెలంగాణ భవన్‌కు వస్తానని చెప్పింది ఆయనే. వెంటనే మాట మార్చి గన్‌పార్క్‌కు వెళ్లారు. గన్‌పార్క్‌కు వెళ్లకుండా పోలీసులు మమ్మల్ని అడ్డుకున్నారు. చర్చకు కేసీఆర్ రావాలని ఇప్పుడు అంటున్నారు. జూపల్లి వాట్సప్‌లో లేఖ పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వాళ్లు చేసిన అప్పులు లేఖలో రాశారు. తాము వచ్చాక రూ.1.77లక్షల కోట్లు అప్పు చేశామని జూపల్లే చెప్పారు. ఆర్‌బీఐ వద్ద తెచ్చిన ఎఫ్ఆర్‌బీఎం అప్పులు మొత్తం చెబుతా. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.1.86లక్షల కోట్లు. ఆర్‌బీఐ తెచ్చిన అప్పులోనే తేడాలు చెప్పారు. ఏం చేయాలో అర్థంకాక డ్యామేజ్ కంట్రోల్ చేసుకుంటున్నారు' అని హరీశ్‌రావు విమర్శించారు.

# కేసీఆర్ పాలనలో అప్పు 8 లక్షల కోట్లు

మొదటిపేజీ తరువాయి

అప్పులు, వడ్డీలు కలిపి (రూ.2.08 లక్షల కోట్లు చెల్లించాం

ఈ రెండున్నరేండ్లలోనే ప్రజాప్రభుత్వం రూ.1.77 లక్షల కోట్ల అప్పు చేసిందని భట్టి చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పుల కు రూ.2,08,681 కోట్లను అసలు, వడ్డీల రూపంలో బ్యాంకులకు చెల్లించిందని భట్టి వెల్లడించారు. కేవలం రూ.మూడు లక్షల కోట్లే అప్పు చేశామని కేటీఆర్, హరీశ్‌రావు అబద్ధా లు చెప్తే ఎలా? అని ప్రశ్నించారు. రిజర్వ్ బ్యాంక్ ద్వారా ప్రభుత్వ ఖాతాల నుంచి కట్టిన భారీ మొత్తం దేనికో వారే సమాధానం చెప్పా లని సవాల్ విసిరారు. భవిష్యత్ లోనూ కేసీఆరే మళ్లీ వస్తారని కేటీఆర్, హరీశ్‌రావు అంటు న్నారని, అలాంటప్పుడు మధ్యలో వారు చేసే ఈ హంగామా దేనికోసమని ప్రశ్నిం చారు. వారికి గతం లేదు, భవిష్యత్ లేదు, కనీసం నైతి కత అయినా ఉండాలి కదా? అని అన్నారు.

### అప్పు భారం తగ్గించాం

బీఆర్ఎస్ ప్రభుత్వం కార్పొరేట్ బ్యాంకుల వద్ద 10 శాతం నుంచి 10.5 శాతం వరకు భారీ వడ్డీ రేట్లతో అప్పులు తెచ్చి రాష్ట్రంపై పెనుభారం వేసిందని భట్టి చెప్పారు. ప్రజా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ఆ అప్పులను డెబిట్ రీస్ట్రక్చరింగ్ ప్రక్రియలోకి తెచ్చిందన్నారు. దీనివల్ల 2025-26 నుంచి 2031-32 మధ్య కాలంలో చెల్లించాల్సిన రూ. 34,058 కోట్ల రుణ భారాన్ని, రూ.11,915 కోట్లకు తగ్గించామని వివరిం చారు. దీని ద్వారా రాష్ట్రానికి రూ.22,142 కోట్లు ఆదా అయ్యిందని చెప్పారు. అడ్డగోలుగా అప్పులు తెచ్చిన వారు, ఇలాంటి ఆర్థిక నిర్వహణపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**సింగరేణిపై విషప్రచారం ఆపండి!**

సింగరేణి సంస్థపై ప్రతిపక్ష నేతలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని భట్టి తప్పుబట్టారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి ఆస్తులు, వనరులు రాష్ట్రానివని వివరించారు. "పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో సింగరేణికి కొత్తగా ఒక్క కోల్ బ్లాక్‌నైనా తెచ్చారా? కనీసం ఉత్పత్తి అయిపోయి మూతపడిన మైనింగ్ బ్లాకులకు బదులుగా కొత్తవి ప్రారంభించారా" అని సూటిగా ప్రశ్నించారు. భద్రాద్రి, యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులను భారీగా విస్తరించిన కేసీఆర్ ప్రభుత్వం, వాటికి అవసరమైన బొగ్గు గనులను మాత్రం ఎందుకు సమకూర్చలేదని నిలదీశారు. కేంద్రం వేలం వేసిన కోల్ బ్లాకుల్లో పాల్గొని సింగరేణికి ఆ గనులను ఎందుకు దక్కించలేకపోయారని ప్రశ్నించారు. సింగరేణికి గనులు వస్తే రాయల్టీ రూపంలో వచ్చే ఆదాయం తెలంగాణకే చెందేదని అన్నారు. రాష్ట్రంలో బొగ్గు కొరత సృష్టించి, విద్యుత్ ప్రాజెక్టులను సంక్షోభంలోకి నెట్టడమే బీఆర్ఎస్ ఉద్దేశమా? అని ప్రశ్నించారు. సింగరేణి కాలరీస్‌లో 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్త వమన్నారు. సింగరేణి అస్తిత్వం, కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేందుకు చేస్తున్న దుష్ప్రచారమని చెప్పారు. సింగరేణి సంస్థలో ఎటువంటి అక్రమాలకు తావులేదనీ, సంస్థ భద్రత కోసం అత్యున్నత స్థాయి జియో-ఫెన్సింగ్ వ్యవస్థ ఉందని ఆయన స్పష్టం చేశారు. ఒక్క కిలో బొగ్గు కూడా మాయం కావడానికి అవకాశం లేన్నారు.

సింగరేణి బొగ్గు మాయం వ్యవహారంపై సమగ్ర నివేదికను ఇవ్వాలని విజిలెన్స్ డైరెక్టర్‌ను భట్టి ఆదేశించారు. కోయగూడెం, సత్తుపల్లి-3 వంటి బొగ్గు బ్లాకులను సింగరేణికి దక్కకుండా చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని విమర్శిం చారు. వాటిని ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్ట డంలో కేసీఆర్ సర్కార్ పాత్ర ఉందన్నారు. దాదాపు 65 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్న సత్తుపల్లి-3 బ్లాకును ప్రయివేటు వారికి ఎందుకిచ్చారని ప్రశ్నిం చారు. సింగరేణిని ఆర్థికంగా దెబ్బతీసి, థర్మల్ పవర్ ప్రాజెక్టులకు బొగ్గు కొరత సృష్టించి, ప్రయివేటు వ్యక్తుల నుంచి బొగ్గు కొనుగోలు చేయాలన్నదే బీఆర్ఎస్ ప్రభుత్వ దుర్మార్గపు ఆలోచన అని ఆరోపించారు. గత పదేండ్లలో ఇరిగేషన్, రోడ్ల నిర్మాణాల పేరుతో ఎస్ఎస్ఆర్ రేట్లు పెంచిన బీఆర్ఎస్ ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో పిల్లలు తినే ఆహారానికి గానీ, వారి కాస్మొటిక్ ఛార్జీలకు గానీ రేట్లు ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. డైట్ ఛార్జీలను ఆరు నుంచి తొమ్మిది నెలల పాటు పెండింగ్‌లో పెట్టి విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసిన ఘనత గత ప్రభుత్వానిదేనన్నారు. పిల్లల డైట్, కాస్మొటిక్ ఛార్జీలను పెంచామన్నారు. నాణ్యత తో కూడిన దుస్తులు, షూస్, పుస్తకాలను ఓపెన్ టెండర్ల ద్వారా పారదర్శ కంగా అందిస్తు న్నామని వివరించారు. టెండర్ విలువ రూ. 1,142 కోట్లు ఉంటే, రూ.రెండు వేల కోట్ల దోపిడీ జరిగిందని ఆరోపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

**మా పిల్లలు మఫత్‌లాల్ బట్టలు, షూ వేసుకోవద్దా? : అడ్లూరి**

గురుకులాల్లో చదివే పిల్లలు మఫత్‌లాల్ బట్టలు, షూ వేసుకోవద్దా? అని హరీశ్‌రావును మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రశ్నించారు. పారదర్శకంగా ఉండేందుకు రూ.1,42 కోట్లకు గ్లోబల్ టెండర్లను పిలిచామన్నారు. అంతకంటే ఒక్క రూపాయి ఎక్కువ టెండర్ పిలవలేదని చెప్పారు. హరీశ్‌రావు చెప్పినట్టు రూ.రెండు వేల కోట్ల కుంభకోణం ఎక్కడ జరిగిందన్నారు. అది జరిగినట్టు నిరూపిస్తే దేనికైనా సిద్ధమనీ, మాటకు కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తాను ఫోన్ ఎత్తలేదని కొందరు దుష్ప్రచారం చేశారని అన్నారు. తాను పిరికివాడి, భయపడే వ్యక్తిని కాదన్నారు. అధికారిక కార్యక్రమంలో ఉన్నందు వల్లే ఫోన్ ఎత్తలేదని చెప్పారు.

## సవాల్‌పై కట్టుబడి ఉన్నందునే వచ్చా



మొదటిపేజీ తరువాయి

కట్టుబడి ఉన్నందునే ప్రెస్‌క్లబ్‌కు వచ్చానన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు కోసం ఎదురుచూస్తున్నానని తెలిపారు. తాను వెనుకడుగు వేసి పారిపోయే వ్యక్తిని కానన్నారు.. 'కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు 4 పేజీల చొప్పున లేఖలు రాశా. ముగ్గురికీ వాట్సాప్‌లోనూ ఆధారాలతో లేఖలు పంపించా. రూ.4.17 లక్షల కోట్ల అప్పు అంటూ హరీశ్ రిటర్న్ లేఖ పంపారు. రూ.8.21 లక్షల కోట్ల అప్పు అని లేఖలో చెప్పా. పారిపోవడం మా ఇంటావంటా లేదు. ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. లేఖలో తాను ప్రస్తావించినవి అబద్ధాలని నిరూపించగలరా అని మంత్రి ప్రశ్నించారు. తాను చెప్పినవి అబద్ధాలైతే రాజీనామాకు సిద్ధం అంటూ పునరుద్ఘాటించారు. హరీశ్‌రావు సొల్లు పురాణం చెబుతున్నారు. నా ప్రశ్నలకు సమాధానం దాటవేస్తున్నారు. నేను అడిగింది ఏంటి? హరీశ్ చెప్పిందేంటి అని నిలదీసారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ కోసం 3 కుర్చీలు వేశాం. హరీశ్‌రావు రాసిన లేఖలో ఏమీ లేదు. ఇప్పటికైనా విలువలతో బతకండి' అని అన్నారు. కాగా, చర్చకు రావాలని పిలిచి పోలీసులతో అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు

మొదటిపేజీ తరువాయి

పాలిత ప్రాంతాలకు చెందిన సుమారు 240 మంది జిల్లా పౌర సంబంధాల అధికారులు హాజరైన ఈ సదస్సులో ఎన్నికల నిర్వహణలో కమ్యూనికేషన్ పాత్ర, మీడియా నిర్వహణ, ఎన్నికల చట్టాలు, డిజిటల్ సాంకేతికత వినియోగం, తప్పుడు ప్రచారాల నియంత్రణ, సోషల్ మీడియా సవాళ్లు, ఎన్నికల సమాచారాన్ని ప్రజలకు వేగంగా చేరవేసే విధానాలపై ఎన్నికల సంఘం అధికారులు సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మాట్లాడుతూ, స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక, పారదర్శక ఎన్నికల నిర్వహణలో మీడియా, ప్రజా సంబంధాల అధికారుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఎన్నికల సంఘం విడుదల చేసే అధికారిక సమాచారాన్ని ప్రజలకు వేగంగా చేరవేయడంతో పాటు తప్పుడు ప్రచారం, అపోహలు, దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాల్సిన బాధ్యత కమ్యూనికేషన్ అధికారులపై ఉందని పేర్కొన్నారు. ÷-రత్యేక ఓటరు జాబితా సవరణ సర్ పక్రియ ప్రాధాన్యాన్ని వివరిస్తూ, పౌరసత్వ చట్టం-1955 నిబంధనలకు అనుగుణంగా అర్హులైన భారతీయ పౌరుల పేర్లు మాత్రమే ఓటరు జాబితాలో ఉండేలా ఈ పక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల పక్రియపై ప్రజల్లో అపోహలు తొలగించి వాస్తవాలను చేరవేయడంలో మీడియా, ప్రజా సంబంధాల అధికారుల పాత్ర అత్యంత ముఖ్యమని చెప్పారు. సదస్సులో ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, ఫారం-17సీ, ఆర్టికల్-324 కింద ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలు, ఎన్నికల ప్రచార నిబంధనలు, పెయిడ్ న్యూస్ నియంత్రణ, సోషల్ మీడియా, కృత్రిమ మేధ వల్ల ఎదురవుతున్న సవాళ్లు, వాటిని ఎదుర్కొనే వ్యూహాలపై ఎన్నికల సంఘం సీనియర్ అధికారులు ప్రత్యేక ప్రజెంటేషన్లు ఇచ్చారు. అలాగే, ఎన్నికల సంఘం రూపొందించిన సమగ్ర డిజిటల్ వేదిక ద్వారా ఓటరు నమోదు, ఓటరు వివరాల సవరణ, పోలింగ్ కేంద్రాల సమాచారం, అభ్యర్థుల అఫిడవిట్లు, ఎన్నికల ఫలితాలు తదితర సేవలను ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన విధానాన్ని వివరించారు. ప్రతి స్మార్ట్‌ఫోన్ వినియోగదారుడు వినియోగించేలా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. సదస్సులో ఎన్నికల కమ్యూనికేషన్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించే విధానాలు, మీడియాతో సమన్వయం, సోషల్ మీడియా వినియోగం, ప్రజల్లో ఎన్నికలపై అవగాహన పెంపు, తప్పుడు ప్రచారాన్ని వేగంగా ఖండించే వ్యూహాలపై విస్తృతంగా చర్చించి పలు సూచనలు చేశారు. తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారుల కార్యాలయం నుంచి అదనపు ప్రధాన ఎన్నికల అధికారి ఎన్. శంకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రసన్నరాజ్, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ సంయుక్త సంచాలకులు యు. వెంకటేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనరేట్ పౌర సంబంధాల అధికారులు ఎం. కిరణ్మయి, ఏ. వనజతో పాటు మీనాక్షి, ఇందిర, అనిల్, విశ్వేశ్ తదితర జిల్లా ప్రజా సంబంధాల అధికారులు పాల్గొన్నారు.

# గూగుల్ కంటే కుప్పం ప్రాజెక్టులే ఎక్కువ సంతోషాన్నిచ్చాయి

**కుప్పంలో రూ.9,322 కోట్ల విలువైన 27 పరిశ్రమలకు వర్చువల్‌గా శంకుస్థాపన**

**అడిడాస్ షూస్, విమానాల తయారీ వంటి కీలక కంపెనీలతో వేల ఉద్యోగాలకు అవకాశం**

**శంకుస్థాపన రోజే ప్రాజెక్టుల ప్రారంభ తేదీలను ప్రకటించిన పారిశ్రామికవేత్తలు**

**దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుప్పాన్ని తీర్చిదిద్దుతానని ముఖ్యమంత్రి హామీ**



"గూగుల్ ఏఐ డేటా సెంటర్ శంకుస్థాపన చేసిన నాటి కంటే, ఇవాళ జరిగిన కార్యక్రమాలతోనే నాకు ఎక్కువ సంతోషంగా ఉంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తన సొంత నియోజకవర్గమైన కుప్పం రూపురేఖలను మార్చే భారీ పారిశ్రామిక ప్రగతికి శ్రీకారం చుట్టిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం గుడుపల్లె మండలం పొగురుపల్లిలో "స్వర్ణ కుప్పం.. పెట్టుబడుల వేదిక" పేరుతో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ వేదికపై నుంచి వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో, వేలాది మందికి ఉద్యోగాలు కల్పించే పలు కీలక ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

ఒకప్పుడు మారుమూల ప్రాంతంగా ఉన్న కుప్పం, ఇప్పుడు అభివృద్ధి కేంద్రంగా మారుతోందని చంద్రబాబు అన్నారు. మొత్తం రూ.9,322 కోట్ల పెట్టుబడులతో 27 పరిశ్రమలు కుప్పంలో కొలువుదీరనున్నాయని ప్రకటించారు. ఫుట్‌వేర్ నుంచి విమానాల తయారీ వరకు వివిధ రంగాలకు చెందిన ప్రఖ్యాత కంపెనీలు తమ యూనిట్లను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాయి.

ఇందులో భాగంగా ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్ అడిడాస్ ఫుట్‌వేర్ తయారీ యూనిట్‌కు సీఎం భూమిపూజ చేశారు. హ్వాసెంగ్ గ్రూప్ ఆధ్వర్యంలో రూ.899 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ పరిశ్రమ ద్వారా ఏకంగా 20,145 మందికి ఉపాధి లభించనుంది.

దేశంలోనే తొలి బ్యాటరీ అనోడ్ మెటీరియల్ ప్లాంట్‌కు కుప్పంలో శ్రీకారం చుట్టారు. అథా గ్రూప్ రూ.2,081 కోట్ల భారీ పెట్టుబడితో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తుండగా, దీని ద్వారా 2,600 మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఏ
వియేషన్ రంగంలోనూ కుప్పం తనదైన ముద్ర వేయనుంది. పయనీర్ క్లీన్ యాంప్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.150 కోట్ల పెట్టుబడితో టూ సీటర్ ట్రైనర్ విమానాల తయారీ యూనిట్‌ను నెలకొల్పనుంది. దీనివల్ల 1,400 మందికి ఉపాధి దొరుకుతుంది.

వీటితో పాటు ఎంఏఎఫ్ క్లోతింగ్ (గార్మెంట్స్), న్యూట్రి ఫీడ్స్ (చికెన్ ప్రాసెసింగ్), ఫామ్ అమినో అగ్రిటెక్ (కర్కుమిన్ ఎక్స్‌ట్రాక్షన్) వంటి అనేక ఇతర పరిశ్రమల నిర్మాణాలకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా పరిశ్రమలకు ఏపీ ప్రభుత్వం అందిస్తున్న సహకారం అద్భుతంగా ఉందని పారిశ్రామికవేత్తలు ప్రశంసించారు. ప్రభుత్వ ప్రోత్సాహం చూశాక, పనులను మరింత వేగంగా పూర్తి చేయాలనే ఉత్సాహం కలుగుతోందని తెలిపారు. శంకుస్థాపన రోజే ప్రారంభోత్సవ తేదీలను నిర్దేశించుకుని పనిచేయాలని పారిశ్రామికవేత్తలకు సీఎం సూచించగా, వారు వేదికపై నుంచే తమ ప్రాజెక్టుల ప్రారంభ తేదీలను ప్రకటించడం విశేషం. అనంతరం ఆయా కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి నిర్వహించిన సీఎం, వారి ఉత్పత్తులు, పనితీరు గురించి ఆరా తీశారు.

# విష్ణువర్ధన్ రెడ్డి అవకాశవాద రాజకీయాలు మానుకో..!

## కొత్తూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి

**ఎమ్మెల్యే శంకర్ ను విమర్శించే ముందు ఆత్మ విమర్శ చేసుకో..**

**ఎంపీగా గెలిచాక డీకే అరుణ సిద్ధాపూర్ ప్రాంత ప్రయోజనా కోసం ఏం చేశారు..?**


**ముందు డీకే అరుణను రాజీనామా చేసి రమ్మను ఆ తర్వాత ఆలోచిద్దాం..**

**సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ కు కాంగ్రెస్ పూర్తి వ్యతిరేకం**

**డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఎమ్మెల్యే ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులను కలిశారు..**

**ఎట్టి పరిస్థితుల్లో డంపింగ్ యార్డును ఈ ప్రాంతంలో మేము ఒప్పుకోం..**

**సమస్య పరిష్కారానికి నిర్మాణాత్మక సూచన సలహాలు చేయండి. దిగజారుడు వ్యాఖ్యలు వద్దు**




**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
సిద్ధాపూర్ ప్రాంతంలో ఘన వ్యర్థపదార్థాల నిర్వహణ ఎకో టౌన్ ప్రాజెక్టుకు కాంగ్రెస్ పార్టీ పూర్తి వ్యతిరేకంగా ఉందని, వాస్తవాలు తెలుసుకోకుండా రాజకీయ స్వార్థం కోసం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విమర్శించడం బిజెపి నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అవకాశవాద రాజకీయాలను స్పష్టం చేస్తుందని కొత్తూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి అన్నారు. 24 గంటల్లో ఎమ్మెల్యే స్పందించకపోతే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే ముక్కు నేలకు రాయాలని అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన బిజెపి నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. కష్టం వచ్చినప్పుడు కలిసి సమస్య నివారణకు పాటుపడాలి ప్రభుత్వ సహకారం తీసుకోవాలి రాజకీయాల్లోకి అతీతంగా స్పందించాలి అనే మంచి విషయాలను పక్కనపెట్టి కుటిల రాజకీయం కోసం తమ స్వార్థం కోసం పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఎమ్మెల్యేను కించపరిచే విధంగా మాట్లాడడం సబబు కాదన్నారు. కొత్తూరు మండలం సిద్ధాపూర్ ప్రాంతంలో సంబంధిత సర్వే నెంబర్లలో ఘన వ్యర్థ ప్రధాన ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం జీవో ఇచ్చిన అంశంపై కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని ఇదే సమయంలో పార్టీ ఏదైనా ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని స్పష్టం చేశారు. గతంలో ఈ అంశం పైన సంబంధిత మంత్రులను జిహెచ్ఎంసి కమిషనర్ జిల్లా కలెక్టర్ అదేవిధంగా ముఖ్యమంత్రి దృష్టికి కూడా ప్రత్యేకంగా సమస్యను తీసుకువెళ్లడం జరిగిందని అయితే ఈ అంశాన్ని ఇలా అధిగమించాలి అన్న తర్జనభజనలు జరుగుతున్న సమయంలో జీవో రావడం దురదృష్టకరమని అయినప్పటికీ ప్రజల పక్షాన అధికార పార్టీ పోరాడడానికి సిద్ధంగా ఉందన్నారు. అవసరమైతే తమ పదవులు తమ రాజకీయాలు వదులుకుంటామని కాంగ్రెస్ పార్టీ పదవుల కోసం గడ్డి తినదని అన్నారు. బాధ్యత గల ప్రతిపక్షాల హోదాలో ఉన్నవారు సరైన సూచన సలహాలు అధికార పార్టీకి ప్రభుత్వానికి చేయాలి తప్ప దిగజారుడు వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఎంపీగా డీకే అరుణ బిజెపి పార్టీ నుండి గెలిచాక కొత్తూరు సిద్ధాపూర్ ప్రాంత ప్రయోజనాలకు ఆమె ఏం చేశారని శేఖర్ రెడ్డి ప్రశ్నించారు. కొంతకాలంగా తాము డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేపట్టామని ఎమ్మెల్యే శంకర్ కూడా స్వయంగా పాల్గొని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారని మరి డీకే అరుణ కనీసం స్పందించారా అని ప్రశ్నించారు. ఎంపీగా గెలిచి ఈ ప్రాంతానికి ఏమి చేయలేని డీకే అరుణ ముందు రాజీనామా చేసి వస్తే అప్పుడు తాము కూడా ఆలోచిస్తామని శేఖర్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డికి ప్రతి సవాల్ విసిరారు

# వన్‌ప్లస్ క్యాంపస్ డామినేట్ 2026..

**16విశ్వవిద్యాలయాల్లో ఈ-స్పోర్ట్స్‌కు కొత్త ఊపు..**

**హైదరాబాద్‌కు చేరుకున్న టోర్నమెంట్**




**హిమాయత్ నగర్, (ప్రజావినికిడి):** దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కళాశాలల ఈ-స్పోర్ట్స్ టోర్నమెంట్ 'వన్‌ప్లస్ క్యాంపస్ డామినేట్' మూడో ఎడిషన్‌తో మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తుందని పేర్కొంది. ఇందులో వివిధ క్యాంపస్‌ల ఛాంపియన్ జట్లు బ్యాటిల్‌గ్రౌండ్స్ మొబైల్ ఇండియా పోటీలో విజేతగా నిలిచేందుకు తలపడనున్నాయనీ వెల్లడించింది. ఎనిమిది నగరాల్లోని 16 విశ్వవిద్యాలయాలకు విస్తరించిన వన్‌ప్లస్ క్యాంపస్ డామినేట్ 2026 టోర్నమెంట్ ఇప్పుడు హైదరాబాద్‌కు చేరుకుంది. గ్రాండ్ ల్యాన్ ఫైనల్ పోటీలు ప్రత్యేకంగా వన్‌ప్లస్ నార్డ్ 6 స్మార్ట్‌ఫోన్‌లపై నిర్వహించబడనున్నాయని పేర్కొంది. ప్రపంచ ప్రముఖ సాంకేతిక బ్రాండ్ వన్‌ప్లస్ తన దేశవ్యాప్త కళాశాలల ఈ-స్పోర్ట్స్ కార్యక్రమమైన వన్‌ప్లస్ క్యాంపస్ డామినేట్ 2026 మూడో ఎడిషన్‌లో భాగంగా హైదరాబాద్ ఎడిషన్‌ను ప్రకటించింది. భారతదేశంలోని విశ్వవిద్యాలయ క్యాంపస్‌లకు నేరుగా పోటీ స్థాయి గేమింగ్‌ను తీసుకెళ్లే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ ఏడాది టోర్నమెంట్‌ను ఎనిమిది నగరాల్లోని 16 విశ్వవిద్యాలయాలకు విస్తరించగా, జూలై 6న హైదరాబాద్‌లో ప్రారంభమైన అనంతరం వచ్చే రెండు నెలల్లో బెంగళూరు, అహ్మదాబాద్, జైపూర్, చండీగఢ్, న్యూఢిల్లీ, నోయిడా నగరాల్లో నిర్వహించనున్నారు.
గత వారం పుణెలోని జీ హెచ్ రైసోని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్లో విజయవంతంగా ముగిసిన తొలి దశలో, 893 మంది క్యాంపస్ ప్రో ప్లేయర్లతో సహా 3,500 మందికి పైగా విద్యార్థులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు.

# జిల్లేడు చౌదర్‌గూడ మండల కేంద్రంలోనే పోలీస్‌స్టేషన్ నిర్మించాలని జేఏసీ డిమాండ్

**షాద్ నగర్ ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పణ**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** జిల్లేడు చౌదర్‌గూడ మండల కేంద్రంలోనే పోలీస్‌స్టేషన్‌ను నిర్మించాలని కోరుతూ జేఏసీ నాయకులు శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. మండల కేంద్రం నుంచి పోలీస్‌స్టేషన్‌ను లాల్పహాడ్‌లో ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను పునఃపరిశీలించాలని వారు అధికారులను కోరారు. జిల్లేడు చౌదర్‌గూడకు చారిత్రక ప్రాధాన్యం ఉందని, గతంలో సంస్థాన కేంద్రంగా పేరొందిందని జేఏసీ నాయకులు తెలిపారు. ప్రస్తుతం చౌదర్‌గూడ వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందడంతో పాటు మార్కెట్, బ్యాంకులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు వంటి అనేక ప్రజా సౌకర్యాలు ఇక్కడే ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పోలీస్‌స్టేషన్‌ను మండల కేంద్రంలో కాకుండా వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయడం ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ ఉంటేనే ప్రజలకు త్వరితగతిన సేవలు అందుతాయని, అత్యవసర సమయాల్లో పోలీసు సేవలు సులభంగా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా తీసుకునే నిర్ణయాలు మండల అభివృద్ధికి ఆటంకంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తుది నిర్ణయం తీసుకోవాలని జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మచ్చ సుధాకర్‌రావు, సయ్యద్ హాఫీజ్ భాయ్, పడకంటి వెంకటేష్, ఎదిర రాజు, వర్కల శివరాజు, బోయ అశోక్‌తో పాటు జేఏసీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ చౌరస్తా విస్తరణకు కసరత్తు..!

**పోలీసు రెవెన్యూ తదితర శాఖల అధికారుల పరిశీలన - అధికారులతో కలిసిన మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు**






**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్ నగర్ పట్టణంలోని ప్రధాన చౌరస్తా విస్తరణ పనులను వేగవంతం చేసేందుకు అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో చౌరస్తా పరిశీలన నిర్వహించారు. రోడ్డు విస్తరణ కోసం మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, ఏసీపీ లక్ష్మీనారాయణ, ఆర్డీవో సరిత, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, సీఐ సీతారాం, తహసీల్దార్ నాగయ్య, మున్సిపల్ టీపీఓ పావని, ఆర్ అండ్ బీ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో సరిత మాట్లాడుతూ, చౌరస్తా విస్తరణలో భాగంగా ఉన్న విగ్రహాలను తరలించే ముందు అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి ఏకాభిప్రాయ తీర్మానం చేయాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ అనుమతులతో విగ్రహాలను అనువైన ప్రదేశానికి తరలించి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు.
ఏసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, అన్ని శాఖల అనుమతులు, రాజకీయ పార్టీల సమ్మతితో విగ్రహాల తరలింపు ప్రక్రియ పూర్తి చేసి, ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వాటిని ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. అనంతరం ఆర్ అండ్ బీ అధికారులు రోడ్డు మార్కింగ్ పూర్తి చేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా విస్తరణ పనులు చేపట్టాలని అన్నారు. దీనిపై స్పందించిన అధికారులు, ప్రభుత్వ ఉత్తర్వులు, గెజిట్ వివరాలను పరిశీలించి రోడ్డు విస్తరణ పరిమితిపై త్వరలో నిర్ణయం ప్రకటించి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. దీంతో షాద్‌నగర్ ప్రధాన చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు తోపాటు ఎమ్మార్వో నాగయ్య, సామాజిక ఉద్యమకారుడు ఆర్యన్ రాము, బిజెపి నాయకులు మల్చలం మురళి తదితరులు పాల్గొన్నారు.

# వినాయక గంజ్‌లో భక్తి వెల్లువ..

**ప్రముఖుల సమక్షంలో ప్రత్యేక పూజలు..**

**గణపతి ఆలయంలో సంకష్టహర చతుర్థి పూజలు..**





**షాద్ నగర్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని వినాయక గంజ్ 20వ వార్డులో గల శ్రీ గణపతి దేవాలయంలో నిజ జ్యేష్ఠ మాస సంకష్టహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయి మిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివాలయంలో ప్రత్యేక అర్చనలు, అభిషేకాల్లో షాద్‌నగర్ పట్టణ ఏసీపీ లక్ష్మీనారాయణ, పట్టణ సీఐ సీతారాం పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్‌ను మలగారి సత్యనారాయణ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భగవాన్ దాస్ మాలాని, అజయ్ కంకణి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ సీతారాం, సాయి మిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంధం ఆనంద్ కుమార్, వన్నాడ వెంకటేష్ గౌడ్, కౌన్సిలర్లు కళ్యాణ్ కార్ దిలీప్ కుమార్, పినమౌని గోపాల్, నరేష్, ఆలయ ట్రస్ట్ సభ్యులు, విష్ణు సహస్రనామ మండలి సభ్యులు, ఆలయ పూజారులు పండిట్ రాజన్ శాస్త్రి, విష్ణు శాస్త్రి, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంబేద్కర్ విగ్రహాన్ని సర్కిల్ సెంటర్‌లోనే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్‌నగర్ ప్రధాన కూడలి విస్తరణ పనులను వేగవంతం చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టడంపై సామాజిక ఉద్యమ నాయకుడు చిన్నోళ్ల అనంతయ్య హర్షం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం చేపడుతున్న ఈ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, మున్సిపల్ చైర్మన్ బసప్ప, ఆర్డీఓ సరిత, తహసీల్దార్ నాగయ్య, ఏసీపీ లక్ష్మీనారాయణ, ఆర్ అండ్ బి అధికారులు, అలాగే ప్రధాన కూడలి విస్తరణ కోసం నిరంతరం కృషి చేస్తున్న ఆర్.ఎన్.రాముకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రధాన కూడలి విస్తరణతో ట్రాఫిక్ సమస్య తగ్గి విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామాల నుంచి వచ్చే ప్రయాణికులకు ఎంతో ఊరట లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. అయితే, విస్తరణ పనుల నేపథ్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ప్రస్తుతం ఉన్న ప్రాంతం నుంచి తొలగించాల్సి వస్తే, అదే ప్రధాన కూడలి (సర్కిల్ సెంటర్)లో గౌరవప్రదంగా పునఃస్థాపించాలని అధికారులను కోరారు. అంబేద్కర్ విగ్రహ స్థాపన కోసం గతంలో ప్రజా సంఘాలు, సామాజిక సంస్థలు, కార్యకర్తలు ఎన్నో ఉద్యమాలు నిర్వహించాయని, తీవ్ర పోరాటాల అనంతరం ఆ విగ్రహం ఏర్పాటు జరిగిందని గుర్తు చేశారు. అందువల్ల ప్రజల మనోభావాలను గౌరవిస్తూ విగ్రహాన్ని సర్కిల్ సెంటర్‌లోనే కొనసాగించేలా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విగ్రహాన్ని వేరే ప్రాంతానికి తరలించే నిర్ణయం తీసుకుంటే ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తూ, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అధికారులు తగిన నిర్ణయం తీసుకోవాలని చిన్నోళ్ల అనంతయ్య కోరారు.

# మహిళా అదృశ్యం



**మొయినాబాద్,(ప్రజావినికిడి):**
మొయినాబాద్ మండల్ పెద్ద మంగళరం గ్రామానికి చెందిన నెర్దామ్ నవనీత అదృశ్యం కుటుంబ సభ్యుల్లో ఆందోళన స్థానికంగా నివాసముంటున్న కల్పన అనే మహిళ అదృశ్యమైన ఘటన ఆందోళనకు గురిచేస్తోంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, కల్పన ఇంటి నుంచి బయటకు వెళ్లిన అనంతరం తిరిగి ఇంటికి చేరుకోలేదు. బంధువులు, స్నేహితులు, తెలిసిన ప్రాంతాల్లో ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు మోహినాబాద్ పోలిస్టేషల్ లో ఫిర్యాదు చేశారు చివరిసారిగా ఎక్కడ కనిపించింది, ఎవరితో మాట్లాడింది, ఎక్కడికి వెళ్లిందనే కోణాల్లో పోలీసులు విచారణ చేపడుతున్నారు. అవసరమైన చోట్ల సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తూ, మోహినాబాద్ పోలిస్టేషల్ సి సి పుటేజ్ ద్వారా చూసారు హైద్రాబాద్ బస్ ఎక్కడం సిసి పుటేజ్ ద్వారా పోలీసులు తెలిపారు. వివిధ బృందాలతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. కల్పన అదృశ్యంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆమె క్షేమంగా తిరిగి రావాలని బంధువులు, స్థానికులు ఆకాంక్షిస్తున్నారు. కల్పన ఆచూకీ తెలిసిన వారు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, మహిళ అదృశ్యానికి గల కారణాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.
నేర్దం అనిత వయసు 40 సంవత్సరాలు

# సిద్ధాపూర్ భూముల బదిలీ రద్దు చేయాలి

**లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మూడవాత్ రాంబల్ నాయక్ డిమాండ్**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 252, 258,361ల పరిధిలోని 86 ఎకరాల ప్రభుత్వ భూమిని జిహెచ్ఎంసి ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం (డంపింగ్ యార్డ్) కోసం బదిలీ చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నం. 641ను వెంటనే రద్దు చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మూడవాత్ రాంబల్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం పేరుతో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల స్థానిక ప్రజల ఆరోగ్యం, పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజలను అబద్ధపు హామీలతో మోసం చేయకుండా ప్రభుత్వం జీవో 641ను వెనక్కి తీసుకోవాలని కోరారు.సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ స్థానిక ప్రజలు,డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చేపడుతున్న ఉద్యమానికి లంబాడి హక్కుల పోరాట సమితి పూర్తి మద్దతు ప్రకటిస్తోందని తెలిపారు.ప్రజల హక్కుల పరిరక్షణ కోసం జరిగే పోరాటంలో తమ సమితి ప్రత్యక్షంగా భాగస్వామ్యం అవుతుందని రాంబల్ నాయక్ స్పష్టం చేశారు.

# తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగు..

**మాజీ వైస్ ఎంపీపీ నరేందర్ రెడ్డి సొంత ఖర్చుతో బోర్‌వెల్ ఏర్పాటు**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**



పులిచెర్లకుంట తండ గ్రామపంచాయతీ పరిధిలో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో మాజీ వైస్ ఎంపీపీ నరేందర్ రెడ్డి తన సొంత ఖర్చుతో నూతన బోర్‌వెల్ ఏర్పాటు పనులను శుక్రవారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, రైతులు, యువకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ, తాగునీటి సమస్య పరిష్కారం కోసం సొంత నిధులతో బోర్‌వెల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి ముందుకు వచ్చిన మాజీ వైస్ ఎంపీపీ నరేందర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, రైతులు, యువకులు, మహిళలు,వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి నరేందర్ రెడ్డి చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఇలాగే కొనసాగాలని గ్రామ ప్రజలు ఆకాంక్షించారు.

# భూ నష్ట పరిహారం చెల్లించాకే పనులు చేయండి

**నాంపల్లి,(ప్రజా వినికిడి):**




హైకోర్టు రక్షణ ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ సర్వే నంబర్లు 849&850లో అక్రమ కూల్చివేతలు, రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని భూయజమానులు ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 849, 850లకు చెందిన భూ యజమానులు ఎం.ఎల్.అగర్వాల్ సీఐ ప్రింట్ ప్రైవేట్ లిమిటెడ్ తమ భూమిపై తెలంగాణ హైకోర్టు రక్షణ ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ కూల్చివేతలు, రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఆరోపించారు.హైదరాబాద్‌లోని రెడ్ హిల్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పిటిషనర్లు మాట్లాడుతూ, అగర్వాల్ కుటుంబం 1964లో ఈ పట్టా భూములను కొనుగోలు చేసిందని,అప్పటి నుంచి ఆరు దశాబ్దాలకు పైగా ఇక్కడే నివసిస్తున్నామని తెలిపారు.కొంత మంది అధికారులు ఆర్ అండ్ బీ విస్తరణ పేరిట తమను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.2021లో రోడ్లు,భవనాల శాఖ (ఆర్ అండ్ బీ) అధికారులు ఈ భూమి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ తమ బ్యారికేడ్లను కూల్చివేశారని తెలిపారు. హైకోర్టులో పిటిషన్ వేయగా కోర్టు తమకు తీర్పునిచ్చిందని వెల్లడించారు. ఇప్పుడు రోడ్డు విస్తరణ పేరిట తమకు ఆటంకం కలిగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వాధికారులు ఓ ప్రవైటు వ్యక్తి కాంట్రాక్టరు ద్వారా తమ భూమిని తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.తన భూమి ప్రభుత్వానికి అవసరమైతే తమకు నష్ట పరిహారం చెల్లించాకే ప్రభుత్వం తన పనులు చేసుకోవాలని కోరారు.

# ప్రధాన కూడలి విస్తరణకు మద్దతు..

**అంబేద్కర్ విగ్రహానికి సరైన స్థలంలో ఏర్పాటు చేయాలి**

**సామాజికవేత్త టెలిఫోన్ వెంకటయ్య**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**



షాద్‌నగర్ ప్రధాన కూడలి విస్తరణ పనులను వేగవంతంగా చేపట్టేందుకు అధికారులు చర్యలు ప్రారంభించడం స్వాగతించదగ్గ విషయమని షాద్ నగర్ దళిత సామాజికవేత్త టెలిఫోన్ వెంకటయ్య అన్నారు. పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్,ఆర్డీఓ సరిత,తహసీల్దార్ నాగయ్య,ఏసీపీ లక్ష్మీనారాయణ, ఆర్ అండ్ బి శాఖ అధికారులు, అలాగే ప్రధాన కూడలి విస్తరణ కోసం నిరంతరం కృషి చేస్తున్న వారిని ఆయన అభినందించారు. అయితే,విస్తరణ పనుల పేరుతో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ప్రజల మనోభావాలకు విరుద్ధంగా వేరే ప్రాంతానికి తరలించరాదని వెంకటయ్య స్పష్టం చేశారు.ఒకవేళ సాంకేతిక కారణాలతో విగ్రహాన్ని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడితే, అదే ప్రధాన కూడలి సర్కిల్ సెంటర్‌లో మరింత గౌరవప్రదంగా పునఃస్థాపించాలని అధికారులను కోరారు.అంబేద్కర్ విగ్రహం అనేది కేవలం ఒక శిల్పం కాదని, సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగ విలువలకు ప్రతీక అని ఆయన అన్నారు.ఆ విగ్రహ స్థాపన కోసం గతంలో అనేక ప్రజాసంఘాలు, దళిత సంఘాలు, సామాజిక ఉద్యమకారులు సుదీర్ఘ పోరాటాలు చేశారని గుర్తు చేశారు. అంబేద్కర్ విగ్రహం విషయంలో ప్రజల మనోభావాలను గౌరవిస్తూ ప్రభుత్వం, అధికారులు సముచిత నిర్ణయం తీసుకోవాలని కోరిన వెంకటయ్య, అభివృద్ధితో పాటు చారిత్రక, సామాజిక విలువలను కూడా పరిరక్షించే విధంగా చర్యలు ఉండాలని విజ్ఞప్తి చేశారు.

# ఎమ్మెల్యే ముందు ముక్కు నేలకు రాయండి..!



**అడ్వాన్స్ సర్టిఫికెట్ పొజిషన్ ద్వారా ఫిబ్రవరి 11న ప్రభుత్వం జిహెచ్ఎంసికి భూమిని అప్పజెప్పింది..**

**ఈ జీవోల గురించి "ఎమ్మెల్యే శంకర్" కు తెలియదా..?**

**నిన్న ప్రభుత్వం విడుదల చేసింది రెక్టిఫికేషన్ జీవో మాత్రమే**

**24 గంటల్లో ఎమ్మెల్యే శంకర్ రాజీనామా చేయాలి..**

**న్యాయం జరగకపోతే ఆమరణ నిరాహార దీక్ష కైనా సిద్ధం.. ప్రాణాలైనా అర్పిస్తా..**

**ఉద్యమాన్ని నీరుగార్చి అసలు విషయమే పక్కదో పట్టించిన ఎమ్మెల్యే క్షమాపణలు చెప్పాలి..**

**షాద్ నగర్ బిజెపి నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్..**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
సిద్ధాపూర్ భూములలో ఘన వ్యర్థాల నిర్వహణ కోసం ప్రభుత్వం ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు 86 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది ఈ రోజు కొత్త విషయం కాదని 2026 ఫిబ్రవరి 11న మొదటి జీవో వచ్చిందని అయినా ఇక్కడ ఎమ్మెల్యే శంకర్ ఆ జీవోను ప్రజలకు తెలియకుండా ఇక్కడ ఆందోళనకారులను మభ్యపెట్టడానికి నాటకం ఆడారని ముందుగా సిద్ధపూర్ ప్రజలకు రైతులకు ఆయా గ్రామస్తులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ముక్కు నేలకు రాయాలని షాద్ నగర్ భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తూరు మండలంలోని సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ ప్రతిపాదిత స్థలాన్ని స్థానికులతో కలిసి ఆయన సందర్శించారు. హైదరాబాద్ లో జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ తరహాలో మరో వ్యర్థాల ప్రాసెసింగ్ ఫెసిలిటీ అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని సిద్ధాపూర్ లో 86 ఎకరాల భూమిని ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ (ఎస్.డబ్ల్యూ.ఎం) ఏర్పాటు కోసం జిహెచ్ఎంసికి కేటాయిస్తున్న పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని ఏకో టౌన్ ప్రాజెక్టులో భాగంగా కేటాయించిన భూమిలో ఘన వ్యర్థాల నిర్వహణ సదుపాయం ఏర్పాటు చేసేలా హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ కు అనుమతి ఇచ్చారని విమర్శించారు. గత ఫిబ్రవరి 11వ తేదీన జిహెచ్ఎంసి కి అడ్వాన్స్ పొజిషన్ సర్టిఫికెట్ ద్వారా భూమిని అప్పగించారని ఈ సందర్భంగా పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.గత ఫిబ్రవరిలో మొదటి జీవో వచ్చిందని నిన్న రెక్టిఫికేషన్ (సవరణ) జీవో విడుదలైందని మరి ముందుగా వచ్చిన జీవో అంశం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు తెలియదా? ఒకవేళ తెలిసినా ప్రజల ఉద్యమాలను చల్లారించేందుకు ఆయన డంపింగ్ యార్డ్ ను రానివ్వనని ప్రగల్భాలు పలికారా? అని విష్ణువర్ధన్ రెడ్డి ప్రశ్నించారు. ప్రజలను మభ్యపెట్టి ఉద్యమాలను ఉద్దేశపూర్వకంగా ఎమ్మెల్యే శంకర్ నీరుగార్చారని ఆరోపించారు. ప్రభుత్వంలో కీలక శాసనసభ్యుడిగా రాష్ట్రస్థాయిలో ఎల్లప్పుడూ ముఖ్యమంత్రితో మంచి సంబంధాలు కలిగిన ఎమ్మెల్యేకు తెలియకుండా ఇదంతా జరిగిందా? అని పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అనుమానాలు వ్యక్తం చేశారు.
"ఫ్రెండ్షిప్ అండ్ కో ఆపరేషన్" ఒప్పందంలో భాగంగా ఏకో టౌన్ ఏర్పాటుకు భూమి కేటాయించాలని 2025 ఆగస్టు 1న జిహెచ్ఎంసి కమిషనర్ టిజిఐఐసి ఎండికి లేఖ రాశారనీ రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్ లోని సర్వేనెంబర్ 252, 258,361లోని 150 ఎకరాల భూమిని బదిలీ చేయాలని కోరారు.దీనికి స్పందించిన టిజిఐఐసి ఆయా సర్వే నెంబర్లలో 86 ఎకరాలను ఎలాంటి ఖర్చు లేకుండా జిహెచ్ఎంసి పేరిట బదిలీ చేసేందుకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి టిజిఐఐసి వైస్ చైర్మన్ కు



అనుమతి ఇచ్చానరన్నారు. దీంతో అడ్వాన్స్ పొజిషన్ సర్టిఫికెట్ ద్వారా భూమిని 2026 ఫిబ్రవరి 11న జిహెచ్ఎంసికి అప్పగించారని పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యేకు తెలియకుండానే జీవో వచ్చిందా అని పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ప్రశ్నించారు. ఈ ఉద్యమం ఇక ఆగదని అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని చివరకు తన ప్రాణ త్యాగం చేయడానికి అయినా తను సిద్ధమేనని విష్ణువర్ధన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. 24 గంటల లోపు దీనిపై ఎమ్మెల్యే తదితర పాలకులు రాజీనామా చేయాలని వారికి సమయం ఇస్తున్నామని తమకు న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున మరో ఉద్యమం ప్రారంభం అవుతుందని హెచ్చరించారు

## పత్రికలో వచ్చిన కథనాలతో కదిలిన జీహెచ్ఎంసీ..

# అక్రమ నిర్మాణంపై డిప్యూటీ కమిషనర్ సీరియస్..!

**డిప్యూటీ కమిషనర్ ప్రవీణ్ రెడ్డికి ఫైర్ బ్రాండ్ జర్నలిస్ట్ తరఫున ఫిర్యాదు..**

**వెంటనే టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు..**

**అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్యకు ఫిర్యాదు కాపీ ఫార్వర్డ్..**

**సీజ్ చేసిన నిర్మాణం ఎలా కొనసాగుతోందో పూర్తి నివేదిక ఇవ్వాలని స్పష్టమైన ఆదేశం..**


**నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించిన డిప్యూటీ కమిషనర్..**



**ముషీరాబాద్,(ప్రజావినికిడి):**
ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో సీజ్ చేసినప్పటికీ కొనసాగుతున్న అక్రమ నిర్మాణానికి సంబంధించిన అంశంపై పత్రికలో వచ్చిన కథనాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ యంత్రాంగం స్పందించింది. ఈ మేరకు ముషీరాబాద్ సర్కిల్41 టౌన్ ప్లానింగ్ డిప్యూటీ కమిషనర్ ప్రవీణ్ రెడ్డి గారికి ఫైర్ బ్రాండ్ జర్నలిస్ట్ గ్రూప్ ఫిర్యాదు అందజేయగా, ఆయన వెంటనే స్పందించి సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు కాపీని పంపిస్తూ తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
ఈ సందర్భంగా అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, సెక్షన్ ఆఫీసర్ కిష్టయ్యలకు ఫిర్యాదు కాపీని ఫార్వర్డ్ చేస్తూ, సీజ్ చేసిన నిర్మాణం మళ్లీ ఎలా కొనసాగుతోందనే అంశంపై పూర్తి స్థాయి విచారణ జరిపి,సమగ్ర నివేదిక సమర్పించాలని డిప్యూటీ కమిషనర్ ఆదేశించినట్లు సమాచారం.
అలాగే సీజ్ బోర్డు తొలగింపు, నిర్మాణ పనులు కొనసాగడం, సంబంధిత నిబంధనల అమలులో చోటుచేసుకున్న పరిస్థితులపై పూర్తిస్థాయి వివరాలు సేకరించి, వాస్తవాలను నిర్ధారించాలని సూచించినట్లు తెలిసింది. చట్టాన్ని ఎవరూ అతిక్రమించే అవకాశం లేకుండా,అక్రమ నిర్మాణాల విషయంలో నిబంధనల ప్రకారమే వ్యవహరించాలని అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.
ముషీరాబాద్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే అంశం ప్రస్తుతం ప్రజల్లో ఆసక్తికరంగా మారింది. సీజ్ చేసిన నిర్మాణం కొనసాగిన ఘటనపై అధికారుల విచారణ ఎలాంటి వాస్తవాలను వెలికితీస్తుందో, బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

## తొలకరి చినుకులతో బొగత జల కళ

**వాజేడు,జులై 4,(ప్రజావినికిడి):**వాజేడు మండలంలోని చీకుపల్లి గ్రామంలో ఉన్న బొగత జలపాతం (వాటర్ పాల్స్) జల కళ సంతరించుకుంది చత్తీష్ ఘడ్ రాష్ట్రంలో కురుస్తున్న వర్షలతో నయగర బొగత జలపాతం ఉరకలేస్తుంది. ఈ విషయం సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న ప్రజలు భారీగా తరలి వస్తున్నారు. వాటర్ పాల్స్ ని తిలకించెందుకు వస్తున్నా ప్రజలకు ఫారెస్ట్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు



# గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు- 2 భూ బాధిత రైతులకు ఊరట..

**ఎకరానికి రూ.40 లక్షలు, హెచ్ఎండిఏ పరిధిలో ఒక ప్లాటు**

**రైతుల తరపున ప్రభుత్వంతో మూడు గంటలపాటు చర్చలు జరిపిన "ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్"**

**జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి సమక్షంలో కుదిరిన కీలక ఒప్పందం**

**షాద్‌నగర్ రైతుల సమస్యల పరిష్కారానికి వారధిగా నిలిచిన ఎమ్మెల్యేకు రైతుల కృతజ్ఞతలు**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు2 నిర్మాణానికి సంబంధించి షాద్ నగర్ నియోజక వర్గంలో భూములు కోల్పోతున్న రైతులకు ఊరటనిచ్చే కీలక నిర్ణయం వెలువడింది. షాద్‌నగర్ నియోజకవర్గంలోని చుక్కమెట్టు, ముటుపూరు, ఉమ్మెంతాల, లాలాపేట, తుమ్మలపల్లి, లచ్చంపేట గ్రామాల మీదుగా రోడ్డు నిర్మాణం చేపట్టనున్న నేపథ్యంలో భూములు కోల్పోతున్న రైతులకు తగిన నష్టపరిహారం కల్పించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రైతుల తరపున అధికారులతో విస్తృతంగా చర్చలు జరిపారు. గతంలో అధికారులు ఆయా గ్రామాల్లో సర్వేలు నిర్వహించి,భూ సర్వే నంబర్లను ప్రకటించడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో రైతులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించగా, రైతుల కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ప్రభుత్వంతో చర్చలు జరిపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, షాద్‌నగర్ ఆర్డీఓ సరిత తదితర అధికారుల సమక్షంలో రైతులతో కలిసి సుమారు మూడు గంటలపాటు సుదీర్ఘంగా చర్చలు నిర్వహించారు. రైతుల అభిప్రాయాలు, ప్రభుత్వ నిబంధనలను పరిగణనలోకి తీసుకుని ఎకరానికి రూ.40 లక్షల నష్టపరిహారంతో పాటు హెచ్ఎండిఏ పరిధిలో ఒక ప్లాటు కేటాయించే విధంగా అంగీకారానికి వచ్చినట్లు వెల్లడించారు. ఈ నిర్ణయంతో భూములు కోల్పోతున్న రైతుల్లో ఆనందం వ్యక్తమైంది. రైతుల పక్షాన నిలబడి ప్రభుత్వంతో చర్చలు జరిపి మెరుగైన నష్టపరిహారం సాధించిపెట్టిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు రైతులు కృతజ్ఞతలు



తెలిపారు. గతంలో ఏ ప్రజాప్రతినిధి కూడా ఈ స్థాయిలో రైతుల తరపున అధికారులతో చర్చలు జరపలేదని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, షాద్‌నగర్ ఆర్డీఓ సరిత,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తుమ్మలపల్లి జితేందర్ రెడ్డి, కొందుర్గు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొవ్వూరి పురుషోత్తం రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కృష్ణారెడ్డి,ఆయా గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చారిత్రక ఆస్తులకు చెదలు పట్టించారు..

**ఆనాటి ఆస్తులను అడ్డగోలుగా విక్రయించారు..**

**చరిత్రాత్మక స్థలంలోనే సీఎస్కే కాలనీ..**

**చారిత్రక గుర్తులను కాపాడండి.. ఆస్తులను పరిరక్షించండి..**

**షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు..**

**ఆస్తుల పరిరక్షణ పై అధికారులకు ఫిర్యాదు..**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
షాద్ నగర్ నియోజకవర్గంలో రాజుల కాలంనాటి సంపద క్రమక్రమంగా ఆక్రమణలకు గురైందని.. చాలావరకు చారిత్రక గుర్తులు అదృశ్యమైపోయాయని మాజీ ఎమ్మెల్యే బక్కనే నర్సింహులు అన్నారు. బిజెపి నేత అందే బాబయ్య, తెలుగుదేశం నేతలు అన్మారి వెంకటయ్య తదితరులతో కలిసి దీనిపై తహసిల్దార్ కు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో ఆయన పేర్కొన్న ప్రకారం 1692-1719 మధ్యన ఈ ప్రాంతాన్ని పాలించిన రాజు సవై వెంకటరెడ్డి కాలంలో ఇక్కడ పలు కట్టడాలు ఉండేవి. కోటబురుజులు, కందకాలు, మంచినీటి బావులు ఇక్కడ పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. అయితే జానమ్మ చెఱువు పెద్ద జానంపేట వద్ద జరిగిన యుద్ధంలో మరణించిన అనంతరం అతని వద్ద మంత్రిగా పనిచేసిన ముబారిజ్ఖాన్ ఢిల్లీ చక్రవర్తి ఫరూక్ పేరిట ఈ ప్రాంతాన్ని ఫరూక్ నగర్ గా మార్చారు. అయితే తర్వాత కాలంలో ఇక్కడ ఉన్న కందకాలు, బురుజులు మొత్తం మాయమై కేవలం నాలుగు బురుజులు, ప్రస్తుత రైతు కాలనీలోని కోట మైసమ్మ ఆలయం మాత్రమే మిగిలిందని అన్నారు. ఆనాడు నిర్మించిన గుర్రపు శాల,వసతి గృహాలు, కందకాలు, బురుజులు పూర్తిగా మాయమయ్యాయని పేర్కొన్నారు. శత్రు దుర్భేద్య కట్టడాలన్నీ అదృశ్యమయ్యాయని వెల్లడించారు. అదేవిధంగా ఏక్ నెంబర్ బావి, జాంబావి,గిరిని బావి,మాల బావి,ల వంటివి కూడా పూర్తిగా మాయమయ్యాయని పేర్కొన్నారు. అప్పటి రాజభవనం వద్ద ఏర్పాటుచేసిన ఫిరంగిలలో ఒకటి మాత్రమే మిగిలిందని స్పష్టం చేశారు. ఆజం అలీ ఖాన్ కోట తర్వాత కాలంలో ఆక్రమణకు గురై ప్రస్తుతం సీఎస్కే కాలనీగా మారిందని, అదేవిధంగా సర్దార్ నగర్ మామిడి తోట, కురువగగూడ ఆస్తులను కూడా ఆజం అలీ ఖాన్ వారసులు అమ్ముకున్నారని పేర్కొన్నారు. ఇక కేశంపేట మండలం పాపిరెడ్డి గూడ, పడకలు ప్రాంతాలలో ఇంకా చారిత్రాత్మక కట్టడాలు ఉన్నాయని, వాటిని ప్రభుత్వం పరిరక్షించాలని కోరారు. అనంతరం ఫరుక్ నగర్ ఎమ్మార్వో నాగయ్యకు బక్రీద్ నరసింహులు ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య, కానుగు అంతయ్య,గంధం ఆనంద్, అనుమానరీ వెంకటయ్య, అంతయ్య తదితరులు తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

# రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణం

**ఈ జూలై నెలలో 10 ప్యాకేజీల పనులు ప్రారంభం**

**నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు**

**ఆర్ అండ్ బి అధికారులతో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**

**హైదరాబాద్,జూలై 03(ప్రజావినికిడి):** ;ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో 'న భూతో న భవిష్యతి' రీతిలో రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణానికి సంకల్పించామని,అందులో భాగంగా జూన్ 28న నల్లగొండ జిల్లా కనగల్ వేదికగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్ర హ్యామ్ రోడ్ల పనుల పైలాన్ ఆవిష్కరణ చేసుకుని,పనులు ప్రారంభించామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. రానున్న రెండేళ్లలో రాష్ట్రంలో ఏ మూలన చూసిన నాణ్యమైన ఆర్ అండ్ బి డబుల్ రోడ్లు వినియోగంలోకి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. 'మంచి రోడ్డు - ప్రగతికి సూచిక' అని తాను బలంగా విశ్వసిస్తానని, దీంతో ప్లలె పట్టణాలకు కనెక్టివిటీ పెరిగి,గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తె స్థానికంగానే ఉద్యోగ,ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు పనుల పురోగతిపై డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆ శాఖ ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఆర్ అండ్ బి లోని విభాగాల వారీగా పనుల పురోగతిపై కూలంకషంగా చర్చించిన మంత్రి,చేపట్టిన



కీలక పనులు ఏ దశల్లో ఉన్నాయో అధికారులను ఆరా తీశారు. మొదటి ఫేజ్ లో సుమారు 13వేల కోట్లతో 6092 కి.మీ రోడ్ల పనులు 34 ప్యాకేజీల్లో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనుండగా.. ఈ జూలై నెలలోనే 10 ప్యాకేజీల పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ప్యాకేజ్-2లో సుమారు 155 కోట్ల అంచనా వ్యయంతో 42కి.మీ పొడవుగల నల్లగొండ-మహబూబ్ నగర్ డబుల్ రోడ్డు పనులు ఇప్పటికే ప్రారంభమైన నేపథ్యంలో పనుల్లో వేగం పెంచాలన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు ఆశించిన స్థాయిలో లేవని,అయినా..

వర్షాకాలం పూర్తి అయిన తర్వాత మూడు షిఫ్టుల్లో రోడ్ల నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. రోడ్ల నిర్మాణం కోసం నిష్ణాతులై, నిరంతరం ఫీల్డ్ లో ఉండే ఇంజనీర్లను ఎంపిక చేసి,ప్యాకేజీల వారిగా పనుల బాధ్యతలు అప్పజెప్పాలని,పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయించడం చీఫ్ ఇంజనీర్ల బాధ్యతేనని మంత్రి స్పష్టం చేశారు. ఈనెల 6న కరీంనగర్ జిల్లాలో చేపట్టే హ్యామ్, రోడ్ల పనులకు ఆ జిల్లా మంత్రులు,స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. అందుకు సంబంధిత ఏర్పాట్లు చూడాలని సి.ఈ లు బి.వి రావు,వసంత్ నాయక్ లను మంత్రి ప్రత్యేకంగా ఆదేశించారు. ‑రాజేంద్ర నగర్ లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నూతన హై కోర్టు భవనం,జడ్జిల నివాస సముదాయ భవనాల నిర్మాణాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని,నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరగాలని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 16 శాతం పనులు పూర్తయ్యాయని సి.ఈ లు రాజేశ్వర్ రెడ్డి, నర్సింగ్ రావు వివరించగా....మూడు షిఫ్టుల్లో నిర్మాణ పనులు జరగాలని,అందుకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచి, నిర్మాణ సంస్థతో సమన్వయం చేసుకుంటూ పనుల్లో వేగం పెంచాలని మంత్రి వారిని ఆదేశించారు. అక్కడ ఆర్ అండ్ బి తరుపున నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్న ఇంజనీర్ల సంఖ్యను పెంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 డిసెంబర్ నాటికి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అట్లాగే ఉస్మానియా జనరల్ ఆసుపత్రి పనుల్లో ఇంకా వేగం పెరగాలని,ఇది కూడా డిసెంబర్ 2027 వరకు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. సనత్ నగర్ టిమ్స్ ప్రారంభానికి సిద్ధం అయిందని,అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్, నిమ్స్ విస్తరణ,వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మాణ పనులు వేగవంతం చేసి అతి త్వరలో ప్రజలకు అందుబాటులోకి వచ్చే విధంగా పని చేయాలని అధికారులను ఆదేశించారు.

# శంషాబాద్ లో మైనర్ బాలిక అదృశ్యం

**ఇంట్లో వాళ్ళు ఆస్పత్రికి వెళ్ళగా... తిరిగి వచ్చేసరికి బాలిక అదృశ్యం...**



**శంషాబాద్,(ప్రజావినికిడి):**
జులై 3, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి వెళ్ళగా ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలిక అదృశ్యమైన ఘటన శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని మదనపల్లి పాత తండా కి చెందిన వార్త్యా నీరజ తండ్రి లక్ష్మణ్, వయస్సు: 17 జూన్ 28 న ఉదయం 11:00 గంటల ప్రాంతంలో నీరజ తండ్రి హాస్పిటల్ కి కోసమని పాలమాకుల గ్రామానికి వెళ్ళగా అదే సమయంలో వద్త్యా నీరజ ఒక్కతే వారి ఇంటి వద్ద ఉన్నది. తిరిగి అదే రోజు 04:00 గంటలకి ఇంటికి వెళ్ళి చూడగా, ఇంటి వద్ద నీరజ కనిపించలేదు. వెంటనే తన కూతురు గురించి చుట్టుప్రక్కల ప్రాంతాలలో అలాగే వారి బంధువులను అడిగి తెలుసుకొనగా ఎక్కడ కూడా నీరజ ఆచూకీ లభించలేదు. ఇట్టి విషయం పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఘనంగా ప్రపంచ మెకానిక్స్ దినోత్సవం

**రక్తదానంలో పాల్గొన్న టూ విలర్ మెకానిక్స్**



**ఎల్బీనగర్,జూన్ 3,(ప్రజావినికిడి):** ప్రపంచ మెకానిక్ దినోత్సవం సందర్భంగా వనస్థలిపురం టూ వీలర్ మెకానిక్స్ ఆటోమొబైల్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరంలో హయత్ నగర్ వనస్థలిపురం హస్తినాపురం బి.యన్.రెడ్డి నగర్ టూ వీలర్స్ మెకానిక్స్ పాల్గొని రక్తదానం చేశారు. మిత్ర బ్లడ్ బ్యాంక్ వైద్య బృందంచే రక్తదానం సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ రాజశేఖర్ రెడ్డి టిఆర్ఎస్ పార్టీ నాయకులు చింతల్ రవి వనస్థలిపురం ఇన్స్పెక్టర్ పాల్గొన్నారు. రక్తదానం చేయడం వల్ల ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని వారు తెలిపారు. సుమారు 50 మంది పైగా పాల్గొని రక్తదానం చేశారు. టూ వీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం గర్వకారణంగా ఉందని టు వీలర్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అరవింద్ రెడ్డి పేర్కొన్నారు. యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి మోయిన్, కోశాధికారి నరేందర్ రెడ్డి,ఆర్గనైజర్ నరసింహ యాదవ్, అడ్వైజర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# దిల్‌సుఖ్‌నగర్‌లో ఇష్క్ దర్బార్ మండి రెస్టారెంట్ ప్రారంభం




**హైదరాబాద్, (ప్రజావినికిడి):**
దిల్‌సుఖ్‌నగర్‌లోని పిల్లర్ నంబర్ 1541, శివాని కాంప్లెక్స్‌లో కదిమ్స్ షోరూమ్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన ఇష్క్ దర్బార్ మండి రెస్టారెంట్‌ను ఘనంగా ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్ గుప్తా, లయన్స్ క్లబ్



హైదరాబాద్ రీజియన్ చైర్మన్ డాక్టర్ బి. విజయ రంగ,బుగ్గారపు శరత్ చంద్ర గుప్త, ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేసి రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. నగరంలో నాణ్యమైన ఆహార సేవలను అందించే కొత్త రెస్టారెంట్లు ప్రజలకు మరిన్ని ఎంపికలను కల్పిస్తాయని అన్నారు. వినియోగదారులకు పరిశుభ్రమైన వాతావరణంలో రుచికరమైన వంటకాలు అందిస్తూ విశ్వాసాన్ని సంపాదించాలని ఆకాంక్షించారు. వ్యాపార రంగంలో కొత్త అడుగు వేసిన నిర్వాహకులు విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు. రెస్టారెంట్ నిర్వాహకులు బింగి బలరామకృష్ణ గౌడ్, సిద్ధం అరుణ్ కుమార్,బింగి రాజేంద్ర గౌడ్, వినయ్ కుమార్ మాట్లాడుతూ.. మండి వంటకాలతో పాటు వివిధ రకాల అరేబియా, భారతీయ రుచులను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. నాణ్యత, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బింగి నరేందర్ గౌడ్, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, స్థానిక ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# పార్లమెంట్ సమావేశాలపై కసరత్తు !

**జూలై 3 (ప్రజావినికిడి):**
ఈ నెలాఖరులో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లోనే మరోమారు మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లులను పెట్టే యోచనలో కేంద్రం ఉంది. అయితే గత సమావేశాల్లో ఈ రెండు బిల్లులు వీగిపోయాయి. అయినా కేంద్రం తన పట్టును విడవకుండా ముందుకు సాగాలన్న యోచన లో ఉంది. ఈ బిల్లులు పాస్ కావాలంటే మూడోవంతు మెజార్టీ అవసరం. అందుకుత తగ్గ కసరత్తు
చేస్తున్నట్లుగా ఉంది. ఇదే సందర్భంలో అన్ని పార్టీలతో చర్చించే ప్రయత్నం మాత్రం చేయడం లేదు. అందరి అభిప్రాయాలను తీసుకుని ముందుకు సాగాలన్న ఆనవాయితీని బిజెపి ఎప్పుడో విడనాడింది. గతంలో సమస్యలు లేదా బిల్లులకు సంబంధించి ముందస్తు అఖిపలక్ష సమావేశాలు జరిగేవి. కానీ అలాంటి ఆనవాయితీని బిజెపి పాటించడం లేదు. దాదాపు 12 ఏళ్లుగా ఏకాభిప్రాయ సాధనలో మోడీ ఏనాడూ ప్రయత్నం చేయలేదు. ఇకపోతే ఏం జరుగుతుందో కూడా ప్రతిపక్షాల ఊహకు కూడా అందడం లేదు. ఈ క్రమంలో రేపటి బిల్లులను ఎప్పుడు, ఎలా ప్రవేశ పెడతారన్నది కేవలం మోడీ, అమిత్ షాలకు మాత్రమే తెలిసి ఉంటుంది. కేంద్రమంత్రులు, బిజెపి నేతలకు కూడా వీటిపై సమాచారం ఉండకపోవచ్చు. ఇలా గోప్యత పాటించడం వల్ల వచ్చే లాభం ఏమిటన్నది కూడా వారికే తెలుసు. ఇకపోతే పార్లమెంట్ సమావేశాలు ఈ నెల 20 నుంచి ప్రారంభం కావచ్చని చూచాయగా తెలుస్తోంది. ఇదే సమయంలో సమావేశాలకు




ముందుగానే మంత్రివర్గ పునర్వ్యస్థీకరణ ఉంటుందని సమాచారం వస్తోంది. దీంతో ఎవరు ఉంటారు, ఎవరు పోతారన్న లెక్కల్లో ఎంపిలు ఉన్నారు. ఇది కూడా మోడీ, అమిత్ షాల కనుసన్నల్లోనే జరుగుతుందనడంలో సందేహం లేదు. అందుకే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అంటే దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందుగానే ఈ మార్పులు జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న రాజకీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని, కొన్ని కీలక మంత్రిత్వ శాఖల్లో కొత్త నాయకులకు చోటు కల్పించడమే లక్ష్యంగా ప్రధాని మోడీ వ్యూహరచన చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. వరుసగా ప్రధాని మోడీ, అమిత్ షాలు వేర్వేరుగా రాష్ట్రపతిని కలవడం ఈ వార్తలకు బలం చేకూరింది. బీజేపీ సంస్థాగత బృందంలో కూడా నితిన్ నబిన్ నేతృత్వంలో సమూల మార్పులు చేసేందుకు పార్టీ అగ్ర నాయకత్వం జాబితాను ఖరారు చేసింది. ప్రభుత్వంతో పాటు పార్టీలో కూడా సమర్థులైన వారికి బాధ్యతలు అప్పగించే దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రభుత్వ పనితీరును మరింత వేగవంతం చేసేందుకు పలువురు మంత్రుల శాఖల్లో మార్పులు ఉండబోతున్నాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విద్యాశాఖ బాధ్యతలు అప్పగించి, ఆ స్థానంలో శక్తికాంత దాస్‌ను తీసుకురావచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అనురాగ్ ఠాకూర్ తిరిగి మంత్రివర్గంలోకి వచ్చే అవకాశం బలంగా ఉంది. పరీక్షల లీకేజీలు, ఆర్థిక సవాళ్ల నేపథ్యంలో సమర్థవంతమైన నాయకత్వం అవసరమని ప్రధాని భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి ధర్మేందర ప్రధాన్‌ను తప్పించే అవకాశాలు కూడా లేకపోలేదు. మరోవైపు పంకజ్ చౌదరి, హర్ష్ మల్హోత్రా వంటి మంత్రులు పార్టీ సంస్థాగత బాధ్యతల్లోకి వెళ్లగా, జార్జ్ కురియన్, రవ్‌నీత్ సింగ్ బిట్టు స్థానాల్లో కొత్త ముఖాలను కేబినెట్లోకి తీసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్,పంజాబ్ రాష్ట్రాల నుంచి మరికొందరు సమర్థ నేతలను మంత్రివర్గం లోకి తీసుకునే అవకాశం ఉంది. బెంగాల్‌లో మెరుగైన ఫలితాలు సాధించిన నేపథ్యంలో అక్కడి ఎంపీలకు ప్రాధాన్యత దక్కవచ్చు. శివసేన రెబెల్ వర్గం నుంచి ఒకరిద్దరికి, ముఖ్యంగా శ్రీకాంత్ షిండేకు అవకాశం లభించవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఆప్ రెబెల్ ఎంపీలు రాఘవ్ చద్దా లేదా అశోక్ మిట్టల్
పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. రానున్న రోజుల్లో జరగనున్న కీలక రాజకీయ పరిణామాల నేపథ్యంలో, ఈ మార్పులు దేశ రాజకీయాలపై ప్రభావం చూపనున్నాయి. కేంద్రంలో ఎన్డీఏ సర్కార్ త్వరలో కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరించే అవకాశం ఉండడంతో ఉభయ తెలుగురాష్ట్రాల్లోనూ మార్పులు ఉండవచ్చు.ముఖ్యంగా తెలంగాణలో ఉన్న ఇద్దరిలో మార్పు ఉంటుందా అన్న చర్చకూడా సాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌కు మరో కేంద్రమంత్రి పదవి దక్కనుందనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే టిడిపి నుంచి ఇద్దరు, బిజెపి నుంచి ఒక్కరు కేబినేట్‌లో ఉన్నారు. ఇప్పటికే ఏపీ నుండి ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ, మరో అదనపు పదవిని టీడీపీకి కేటాయించే యోచనలో బీజేపీ ఉన్నట్లు సమాచారం. ఏపీలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి బలంగా ఉండటంతో, కేంద్రంలో మరిన్ని అవకాశాలు దక్కేలా చంద్రబాబు వ్యూహరచన చేస్తున్నారు. ఒకవేళ మూడో పదవి వస్తే, అది టీడీపీ ఖాతాలోకే వెళ్తుందా లేక జనసేనకు వెళుతుందా, లేక బిజెపికే వెళుతుండా అన్నది చూడాలి. పరిణామం రాష్ట్ర అభివృద్ధికి, కేంద్రంతో సత్సంబంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని పార్టీ నేతలు ఆశిస్తున్నారు. మరోవైపు, సామాజిక సమీకరణాలను బట్టి నిర్ణయం తీసుకుంటే పరిస్థితి మారవచ్చు. మహిళా కోటాలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పేరును కూడా అధిష్టానం పరిశీలించే అవకాశం ఉంది. కొత్త వారికి అవకాశం ఇస్తారా లేదా అనుభవజ్ఞుల వైపు మొగ్గు చూపుతారా అనేది వేచి చూడాలి. బిజెపికే ఇస్తే మహిళా ఎంపి పురంధేశ్వరికి ఛాన్స్ దక్కవచ్చని అనుకుంటున్నారు. ఒకవేళ ప్రాంతీయ సమతుల్యత పాటిస్తే, ఉత్తరాంధ్ర లేదా రాయలసీమ ప్రాంతాలకు ప్రాధాన్యత పెరిగే ఛాన్స్ ఉంది. మంత్రి పదవి దక్కితే ఏపీకి కేంద్ర నిధులు, ప్రాజెక్టుల విషయంలో మరిన్ని ప్రయోజనాలు చేకూరతాయని పార్టీ భావిస్తోంది. మొత్తంగా ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలు, మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లుల వ్యయహారంతో పాటు మంత్రివర్గ విస్తరణ అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా ఉంది. రానున్న రోజుల్లో దీనిపై స్పష్టత రానుంది. బిజెపి వ్యూహం ఎలా ఉందన్నది కూడా తెలియనుంది.

# ప్రమాదంలో తక్షశిల పురావస్తు సంపద

## ఆందోళన వ్యక్తం చేసిన యునెస్కో -అక్కడ చేపట్టిన పనులను ఆపాలని పాక్‌కు ఆదేశం

**ఇస్లామాబాద్,జూలై 3 (ప్రజావినికిడి):**
అవిభక్త భారతదేశంలో తక్షశిల ఓ విశ్వవిద్యాలయం. ఆర్య చాణక్యుడు అక్కడ ఏర్పాటు చేసిన విశ్విద్యాలయం అప్పట్లోనే ప్రపంచ ప్రసిద్ధి గాంచింది. అయితే భారత్‌పై విదేశీ దండయాత్రల్లో దీనిని కూడా ధ్వంసం చేశారు. చివరు దేశ విభజనలో అది పాక్ భూభాగంలోకి వెళ్లింది. ఇప్పుడు అక్కడి పురావస్తు సంపద ప్రమాదంలో పడిందని యునెస్కో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పాకిస్థాన్‌లోని ప్రాచీన పురావస్తు క్షేత్రం తక్షశిలలో ప్రభుత్వం చేపట్టిన సంరక్షణ పనులపై యునెస్కో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రపంచ వారసత్వ జాబితాలో ఉన్న ఈ చారిత్రక కట్టడాల్లో చేపట్టిన పనులు అసలు నిర్మాణాల ప్రామాణికత, చారిత్రక విలువను దెబ్బతీసేలా ఉన్నాయని హెచ్చరించింది. ఈ మేరకు పనులను వెంటనే నిలిపివేయకపోతే తక్షశిలను 'వరల్డ్ హెరిటేజ్ ఇన్ డేంజర్' జాబితాలో చేర్చడంతో పాటు, అవసరమైతే ప్రపంచ వారసత్వ హోదానూ రద్దు చేస్తామని పాకిస్థాన్ అధికారులను హెచ్చరించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెలువడ్డాయి. పంజాబ్ ప్రావిన్స్‌లోని రావల్పిండి జిల్లాలో ఉన్న తక్షశిల.. దక్షిణాసియాలోనే అత్యంత ప్రాచీన బౌద్ధ విద్యా కేంద్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. మెసోలిథిక్ కాలానికి చెందిన గుహ, నాలుగు ప్రాచీన పట్టణాల అవశేషాలు, బౌద్ధ విహారాలు, మసీదు, మదరసా వంటి
నిర్మాణాలతో ఈ ప్రాంతం విశేష చారిత్రక ప్రాధాన్యం కలిగి ఉంది. భారత ఉపఖండంలోని పట్టణ నాగరికత అభివృద్ధికి తక్షశిల ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోందని యునెస్కో పేర్కొంటోంది. ఈ ఏడాది మార్చిలో ఓ సందర్శకుడు తక్షశిలలో జరుగుతున్న పనులకు సంబంధించిన ఫొటోలు, వివరాలను ప్యారిస్‌లోని




UNESCO
World Heritage

పాకిస్థాన్ శాశ్వత ప్రతినిధి కార్యాలయానికి పంపించాడు. అసలు రాతి గోడలను తొలగించి కొత్త నిర్మాణాలు చేపట్టడం, పాత గోడల ఎత్తు పెంచడం వంటి చర్యలు చారిత్రక కట్టడాల ప్రామాణికతకు విఘాతం కలిగిస్తున్నాయని ఆయన ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులతో జూన్ 12న యునెస్కో ప్రతినిధులు, పాకిస్థాన్ పురావస్తు శాఖ, జాతీయ వారసత్వ మంత్రిత్వ శాఖ అధికారులు కలిసి తక్షశిల మ్యూజియాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మొహ్రా మొరాడు, సిర్కాప్ ప్రాంతాల్లో చేపట్టిన పనులకు సంబంధించిన పూర్తి సాంకేతిక పత్రాలను పంజాబ్ పురావస్తు శాఖ సమర్పించలేకపోయినట్లు సమాచారం. అంతేకాకుండా ప్రపంచ వారసత్వ కట్టడాల గోడలను సిమెంట్‌తో నిర్మించడం, పురాతన గోడల స్థానంలో కొత్త రాతి నిర్మాణాలు చేపట్టడం, గోడల ఎత్తును పెంచడం వంటి చర్యలు యునెస్కో నిబంధనలకు విరుద్ధమని అధికారులు పేర్కొన్నారు. పాత రాళ్లకు, కొత్త నిర్మాణ సామగ్రికి మధ్య స్పష్టమైన తేడా కనిపిస్తోందని తెలిపారు. ప్రపంచ వారసత్వ కట్టడాల్లో ఇటువంటి మార్పులు చేయడం తీవ్ర ఉల్లంఘనగా పరిగణిస్తామని యునెస్కో స్పష్టం చేసింది. దీంతో తక్షశిల ప్రపంచ వారసత్వ హోదా ప్రమాదంలో పడే అవకాశం ఉందని, ఇదే పరిస్థితి కొనసాగితే 'డేంజర్ లిస్ట్'లో చేర్చడంతో పాటు అవసరమైతే జాబితా నుంచి పూర్తిగా తొలగించే అవకాశమూ ఉందని హెచ్చరించింది. ప్రస్తుతం మరో 24 చారిత్రక ప్రాంతాలకు ప్రపంచ వారసత్వ హోదా పొందేందుకు పాకిస్థాన్ చేస్తున్న ప్రయత్నాలపైనా ఈ వివాదం ప్రతికూల ప్రభావం చూపే అవకాశముందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఈ ఆరోపణలను పంజాబ్ పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ మాలిక్ జహీర్ అబ్బాస్ ఖండించారు. ప్రస్తుతం జరుగుతున్నవి 'పునర్నిర్మాణ పనులు కావు.. సంరక్షణ చర్యలు మాత్రమే' అని ఆయన స్పష్టం చేశారు. శిథిలావస్థకు చేరుతున్న నిర్మాణాలను మరింత దెబ్బతినకుండా కాపాడటం, వాటి అసలు స్వరూపాన్ని సంరక్షించడమే లక్ష్యమని చెప్పారు. ఈ మేరకు చేపట్టిన పనులను వెనక్కి తీసుకోవాల్సిన అవసరం లేదని పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ మాలిక్ జహీర్ అబ్బాస్ పేర్కొన్నారు.

# షాద్‌నగర్ చౌరస్తా రోడ్డు విస్తరణకు వెంటనే శ్రీకారం చుట్టాలి.

**. జాతీయ బీసీ సేన**

**ఆర్డీవో, తహసీల్దార్, ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులకు వినతిపత్రం..**

**ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్..**

**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని రోడ్డు విస్తరణ పనులను తక్షణమే ప్రారంభించాలని కోరుతూ జాతీయ బీసీ సేన నాయకులు ఆర్డీవో ఎన్.ఆర్.సరిత, తహసీల్దార్ నాగయ్య,ఆర్ అండ్ బీ శాఖ సహాయ ఇంజనీర్ (ఏఈ),మున్సిపల్ కమిషనర్ సునీత, మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వంకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జాతీయ బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు వరప్రసాద్ మాట్లాడుతూ, షాద్‌నగర్ ప్రధాన చౌరస్తాలో వాహనాల రాకపోకలు రోజురోజుకు పెరుగుతున్నాయని,దీంతో తరచూ ట్రాఫిక్ జామ్‌లు



ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.రద్దీ కారణంగా ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజల ప్రాణాలు,ఆస్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టాలని, అవసరమైన నిధులు విడుదల చేసి పనులను వేగవంతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన అధికారులు చౌరస్తా రోడ్డు విస్తరణకు సంబంధించిన అంశాలను సమగ్రంగా పరిశీలించి, ప్రభుత్వ అనుమతులు అదేవిదంగా అవసరమైన పరిపాలనా ప్రక్రియలు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సేన షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్యాట జయ శ్రీకాంత్,రంగారెడ్డి జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు గిరిబాబు,చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, షాద్‌నగర్ టౌన్ అధ్యక్షురాలు కే.సరస్వతి, పలువురు బీసీ సేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి కీలక అడుగు

## శంగవరపుకోటలో వర్చువల్‌గా ప్రారంభించిన చంద్రబాబు

## రాష్ట్ర అభివృద్ధికి కీలకం అన్న హోంమంత్రి అనిత


**విజయనగరంజూలై 3 (ప్రజావినికిడి):** ఏపీలో ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి కీలక అడుగు పడింది. శుక్రవారం జిల్లాలోని శృంగవరపుకోట మండల పరిధిలో ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి కడప జిల్లా జమ్ములమడుగు నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విశాఖపట్నం ఎంపీ శ్రీ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలు, పెట్టుబడులు రావాలన్నారు. రైతులకు భూమికి ఉన్న సంబంధం – తల్లికి బిడ్డకు ఉన్న సంబంధం లాంటిదని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం రైతులకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మొదటి దశలో 535 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు వస్తుందని చెప్పారు. వివిధ పరిశ్రమల ఏర్పాటు ద్వారా సుమారు 45 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయని మంత్రి వెల్లడించారు. ఎస్.కోట నియోజకవర్గం రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చెందనుందని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు విషయంలో ఎర్ర బస్సు రానిచోట, ఎయిర్‌పోర్టు ఎలా వస్తుందని జగన్ అన్నారని.. ఇప్పుడు భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర నుంచి గతంలో వలసలు వెళ్లేవారని.. ఇప్పుడు ఉత్తరాంధ్రకే వివిధ ప్రాంతాలవారు వలసలు వచ్చే పరిస్థితి ఉందని అనిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే లలిత కుమారి, ఎమ్మెల్సీలు రఘురాజు, శ్రీనివాస్ నాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, అధికారులు హాజరయ్యారు.

----

# అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు

## హెచ్చరించిన వాతావరణ శాఖ

**విశాఖపట్టణం,జూలై 3(ప్రజావినికిడి):**
ఉత్తర, పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్ష కురిసే అవకాశం ఉందని, దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో తేలిక నుంచి మోస్తరు వర్షాలు



కురిసే అవకాశముందని పేర్కొన్నారు. వాయవ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది రాబోయే రెండు, మూడు రోజుల్లో మరింత బలపడే అవకాశం ఉందన్నారు. గంటకు 40–50 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శుక్రవారం మేఘావృతమైన వాతావరణంతో శ్రీకాకుళం, పోలవరం, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు.

--------

# విదేశీ పేరున్నంత మాత్రాన హిందువు కాదంటే ఎలా

## మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు

**చెన్నై,జూలై 3 (ప్రజావినికిడి):**
మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. విదేశీ పేరు, పౌరసత్వం ఉన్నంత మాత్రాన హిందూ గుర్తింపును నిరాకరించలేమని తేల్చి చెప్పింది. హిందూ మతాన్ని స్వీకరించడానికి ఎలాంటి సర్టిఫికెట్లు, ప్రత్యేక వేడుకలు అవసరం లేదని మద్రాస్ హైకోర్టు అభిప్రాయపడింది. ఈ మేరకు తమిళనాడు దేవాదాయ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ, అమెరికా పౌరురాలు లారా ఫ్రాన్సెస్ అయ్యంగార్‌ను హిందూ భక్తురాలిగానే పరిగణించాలని ఆదేశించింది.




లారా ఫ్రాన్సెస్‌ను 'అమెరికన్ క్రైస్తవ మహిళ'గా పేర్కొంటూ తమిళనాడు దేవాదాయ శాఖ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. విదేశీయులు అనగానే క్రైస్తవులని అంచనా వేయడం తప్పు అని తెలిపింది. మనఃస్ఫూర్తిగా మతాన్ని ఆచరిస్తూ, హిందూ జీవన విధానాన్ని పాటిస్తే వారు హిందువులే అవుతారని స్పష్టం చేసింది. ఈ మేరకు తంజావూరు ఆలయంలో హిందూ మహిళలకు ఉండే అన్ని పూజా, దర్శన హక్కులు అమెరికన్ మహిళకు కూడా వర్తిస్తాయని తేల్చి చెప్పింది. ఆగమ శాస్త్రాలు, ఆలయ నిబంధనలకు లోబడి విదేశీ హిందూ భక్తురాలికి సమాన హక్కులు కల్పించాలని మద్రాస్ హైకోర్టు హుకుం జారీ చేసింది.

--------------

# టీ20తో గ్లోబల్ స్పోర్ట్స్‌గా క్రికెట్

న్డే ఇంటర్నేషనల్ క్రికెట్ యొక్క దీర్ఘకాలిక భవిష్యత్తుపై భారత స్పిన్ దిగ్గజం రవిచంద్రన్ అశ్విన్ తీవ్ర సందేహాలు వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో క్రికెట్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించడానికి కేవలం టీ20 ఫార్మాట్ మాత్రమే అత్యంత అనుకూలమైనదని ఆయన అభిప్రాయపడ్డారు. తక్కువ సమయంలో ముగిసే మ్యాచ్‌లను ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులు ఎక్కువగా ఇష్టపడతారని, క్రికెట్‌ను ఒక గ్లోబల్ స్పోర్ట్స్‌గా మార్చాలనే ఐసీసీ ఆశయాలకు ఈ ఫార్మాట్ ఎంతో కీలకమని అశ్విన్ పేర్కొన్నారు. క్రికెట్ చరిత్రలోనే ఒక కీలకమైన మలుపు తిరుగుతున్న తరుణంలో అశ్విన్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. దాదాపు 128 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత, 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్ మళ్లీ రీ-ఎంట్రీ ఇవ్వబోతోంది. చివరిగా 1900 పారిస్ ఒలింపిక్స్‌లో మాత్రమే క్రికెట్ పోటీలు జరిగాయి. వీటికి సంబంధించిన అర్హత ప్రమాణాలను కూడా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఇటీవల అధికారికంగా ప్రకటించింది.వార్తా సంస్థ పీటీఐ నివేదిక ప్రకారం అశ్విన్ మాట్లాడుతూ.. "మరో రెండు సంవత్సరాలలో ఒలింపిక్స్ జరగబోతోంది. క్రికెట్‌ను ప్రపంచ స్థాయి క్రీడగా మార్చడంలో ఐసీసీ నిజంగానే సీరియస్‌గా ఉంటే, ప్రస్తుతం నడుస్తున్న వివిధ టీ20 లీగ్‌లలోని జట్లు ఈ విస్తరణలో చాలా కీలక పాత్ర పోషిస్తాయి" అని అన్నారు. అమెరికాలో జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్ లో 'సాన్ ఫ్రాన్సిస్కో యూనికార్న్స్' జట్టు తరపున ఆడుతున్న అశ్విన్, ప్రపంచవ్యాప్తంగా ఫ్రాంచైజీ టీ20 లీగ్‌ల వేగవంతమైన వృద్ధి మరియు ఒలింపిక్స్‌లో క్రికెట్ చేరడం వల్ల ఈ క్రీడకు ఆటగాళ్లు మరియు అభిమానుల సంఖ్య విపరీతంగా పెరుగుతుందని విశ్వసిస్తున్నారు. అదే సమయంలో 50 ఓవర్ల ఫార్మాట్ ఉనికిపై ఆయన నేరుగా ప్రశ్నలు లేవనెత్తారు. "క్రికెట్ మరింత పెద్దగా విస్తరించాలంటే ఇదే సరైన మార్గం. దీనివల్ల



వివిధ దేశాల నుంచి ఎక్కువ మంది ప్రతిభావంతులైన ఆటగాళ్లు వెలుగులోకి వస్తారు. ఏడాది పొడవునా జరిగే లీగ్‌లకు కూడా ఇది చాలా అవసరం. క్రీడగా టీ20 ఫార్మాట్ ఎప్పటికీ నిలిచిపోతుంది. కానీ, వన్డే క్రికెట్ భవిష్యత్తు ఎంతవరకు ఉంటుందో నాకైతే ఖచ్చితంగా తెలియడం లేదు" అని అశ్విన్ నిర్మొహమాటంగా చెప్పారు. వన్డే క్రికెట్ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేసిన మొదటి దిగ్గజం అశ్విన్ మాత్రమే కాదు. ఒకవైపు సంప్రదాయ టెస్ట్ క్రికెట్‌కు ఉన్న ఆదరణ, మరోవైపు టీ20 లీగ్‌లకు ఉన్న కమర్షియల్ సక్సెస్ (ఆర్థిక లాభాలు) మధ్య వన్డే ఫార్మాట్ ప్రస్తుతం నలిగిపోతోంది. ఐసీసీ టోర్నమెంట్లు మినహా, రెండు దేశాల మధ్య జరిగే ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లకు ఆదరణ భారీగా తగ్గుతోంది. ఇదే విషయమై ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఇయాన్ చాపెల్ సైతం గతంలో ఆందోళన వ్యక్తం చేశారు. క్రికెట్ బోర్డుల నిర్వాహకులు తీసుకుంటున్న స్వల్పకాలిక నిర్ణయాలు, టీ20ల ద్వారా వచ్చే ఆర్థిక లాభాలపై చూపిస్తున్న వ్యామోహం వల్లే వన్డేల ప్రజాదరణ తగ్గిపోయిందని, ఈ ఫార్మాట్ కేవలం వరల్డ్ కప్ సమయానికే పరిమితమయ్యేలా మార్చేశారని చాపెల్ విమర్శించారు.

# 36 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టిన ఉనై సైమన్

ఫిఫా ప్రపంచ కప్ 2026 లో స్పెయిన్ జట్టు తన విజయ పరంపరను కొనసాగిస్తూ ఘనంగా ప్రీక్వార్టర్స్‌కు చేరుకుంది. టోర్నమెంట్‌లో భాగంగా జరిగిన రౌండ్-32 పోరులో స్పెయిన్ ఏకపక్షంగా ఆస్ట్రియాను 3-0 తేడాతో చిత్తు చేసింది. మ్యాచ్‌లో స్పెయిన్ స్టార్ ప్లేయర్ మైకెల్ 36వ, 89వ నిమిషాల్లో రెండు అద్భుతమైన గోల్స్ సాధించగా, పెడ్రో పోర్రో 66వ నిమిషంలో మరో గోల్ కొట్టి జట్టుకు భారీ విజయాన్ని ఖాయం చేశాడు. ఈ విజయంతో పాటు స్పెయిన్ గోల్ కీపర్ ఉనై సైమన్ ఫుట్‌బాల్ చరిత్రలో ఒక అరుదైన ఘనతను సొంతం చేసుకుని, 36 ఏళ్లనాటి సుదీర్ఘ రికార్డును బద్దలు కొట్టాడు. ప్రపంచకప్ బరిలో ప్రత్యర్థులకు సింహస్వప్నంగా మారిన ఉనై సైమన్, ఏకంగా 519 నిమిషాల పాటు ప్రత్యర్థులను ఒక్క గోల్ కూడా చేయనీయకుండా అడ్డుకుని సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. దీనితో 1990 వరల్డ్ కప్‌లో ఇటలీ లెజెండరీ ప్లేయర్ వాల్టెర్ జెంగా నెలకొల్పిన 517 నిమిషాల నాటి క్లీన్-షీట్ ఘనతను సైమన్ అధిగమించాడు.గత ప్రపంచ కప్ నుంచి ఈ స్పెయిన్ గోల్ కీపర్ అద్భుత ఆటతీరుకు తిరుగులేకుండా పోయింది. చివరిగా 2022 ప్రపంచ కప్ గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లో జపాన్ జట్టు స్పెయిన్‌పై 51వ నిమిషంలో గోల్ చేసింది. ఆ తర్వాత నుంచి ఇప్పటివరకు జరిగిన ఏ మ్యాచ్‌లోనూ స్పెయిన్ నెట్‌లోకి బంతిని పంపడం ప్రత్యర్థులకు సాధ్యం కాలేదు.ఈసారి లీగ్ స్టేజ్‌లో ఆడిన మూడు మ్యాచుల్లో రెండు విజయాలు, ఒక డ్రాతో గ్రూప్ ఎ లో అగ్రస్థానాన్ని సొంతం చేసుకున్న స్పెయిన్.. ఇప్పుడు నాకౌట్ మ్యాచ్‌లోనూ ఆస్ట్రియాను గోల్ కొట్టనీయకుండా ఉనై సైమన్ అడ్డుకోవడంతో అప్రతిహతంగా దూసుకుపోతోంది. ప్రీక్వార్టర్స్‌లో (రౌండ్-ఆఫ్-



16) స్పెయిన్ జట్టు తదుపరి పోరులో క్రిస్టియానో రొనాల్డో నాయకత్వంలోని బలమైన పోర్చుగల్ జట్టుతో తలపడనుంది. ఫిఫా వరల్డ్ కప్ 2026 నాకౌట్ పోరులో అభిమానులను ఉత్కంఠతలూగించే హై-డ్రామా మ్యాచ్ చోటుచేసుకుంది. స్టార్ స్ట్రైకర్ క్రిస్టియానో రొనాల్డో, యువ సంచలనం గొంకాలో రామోస్ అద్భుత గోల్స్‌తో పోర్చుగల్ జట్టు 2-1 తేడాతో బలమైన క్రొయేషియాను మట్టికరిపించింది. హోరాహోరీగా సాగిన ఈ రౌండ్-ఆఫ్-32 పోరులో విజయం సాధించడం ద్వారా పోర్చుగల్ ప్రీక్వార్టర్స్ (రౌండ్-ఆఫ్-16) కు దూసుకెళ్లింది.

# రొనాల్డో ప్రపంచ రికార్డ్ నమోదు

పోర్చుగల్ సాకర్ దిగ్గజం 41ఏళ్ల క్రిస్టియానో రొనాల్డో నయా హిస్టరీ క్రియేట్ చేశాడు. 2026 ఫిఫా ప్రపంచ కప్ 'రౌండ్ ఆఫ్ 32'లో క్రొయేషియాతో జరిగిన మ్యాచ్‌లో పోర్చుగల్ 2-1 తేడాతో విజయం సాధించింది. ఈ క్రమంలోనే రొనాల్డో ఫిఫా టోర్నమెంట్ చరిత్రలో కీలక రికార్డును కూడా నెలకొల్పాడు. టొరంటో వేదికగా శుక్రవారం తెల్లవారుజామున పోర్చుగల్ - క్రొయేషియా మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగడంతోనే రొనాల్డో అరుదైన ఘనత సాధించాడు. ఫిఫా చరిత్రలో నాకౌట్ మ్యాచ్ ఆడిన అత్యంత పెద్ద వయస్కుడిగా రికార్డు కొట్టాడు. నేటికి రొనాల్డో వయసు 41ఏళ్ల 147 రోజులు. అంతేకాకుండా ఈ మ్యాచ్‌లో అతడు ఓ గోల్ సాధించాడు. సెకండ్ హాఫ్‌లో 68వ నిమిషంలో పెనాల్టీ కిక్ ద్వారా రొనాల్డో గోల్ కొట్టాడు. దీంతో ఫిఫా హిస్టరీలో నాకౌట్ మ్యాచ్‌ల్లో గోల్ సాధించిన అత్యంత పెద్ద వయస్కుడిగానూ రొనాల్డో సరికొత్త రికార్డు నెలకొల్పాడు. అంతకుముందు ఈ రికార్డు పోర్చుగల్ ఆటగాడు పేపే పైన ఉంది. అతడు 39ఏళ్ల 283 రోజుల వయసులో 2022 ప్రపంచకప్‌లో స్విట్జర్లాండ్‌పై గోల్ చేశాడు. దీంతో ఈ మ్యాచ్‌కు ముందు పేపే పైనే ఈ రికార్డు కొనసాగుతూ వచ్చింది. తాజాగా దాన్ని రొనాల్డో బ్రేక్ చేశాడు. అయితే ఓవరాల్‌గా ఫిఫా ప్రపంచ కప్ చరిత్రలో గోల్ చేసిన అత్యంత పెద్ద వయస్కుడిగా మాత్రం రోజర్ మిలా (కామెరూనియన్) కొనసాగుతున్నారు. అతడు 42ఏళ్ల 39 రోజుల వయస్సులో 1994 ఫిఫా ప్రపంచ



కప్‌లో రష్యాపై గోల్ కొట్టాడు. ఫిఫా ప్రపంచ కప్ నాకౌట్ మ్యాచ్‌లో గోల్ సాధించడం రొనాల్డోకు ఇదే తొలిసారి కావడం విశేషం. అతడు అంతకుముందు ఫిఫాలో అనేక గోల్స్ చేసినా, కీలకమైన నాకౌట్ మ్యాచ్‌ల్లో మాత్రం గోల్ కొట్టలేదు. తాజా మ్యాచ్‌తో రొనాల్డో కెరీర్‌లో ఆ లోటు కూడా తీరిపోయింది. ఇక ప్రస్తుత వరల్డ్‌కప్‌లో రొనాల్డోకు ఇది మూడో గోల్. గ్రూప్ స్టేజ్‌లో అతడు ఉజ్బెకిస్థాన్‌పై రెండు గోల్స్ చేశాడు. అలాగే ఓవరాల్‌గా ఫిఫాలో రొనాల్డోకు ఇది 15వ గోల్. కెరీర్ చివరిదశలో ఉన్న రొనాల్డో ఈ వరల్డ్‌కప్ ముగిసేలోపే రిటైర్మెంట్ ఇచ్చేస్తాడని ప్రచారం మొదలైంది. పైగా దీనిపై తన నిర్ణయాన్ని ఈ వరల్డ్‌కప్‌లోనే ప్రకటిస్తాడని రొనాల్డో సోదరి ఈ మ్యాచ్‌కు ముందు సోషల్ మీడియాలో ఓ పోస్టు షేర్ చేసింది. దీంతో అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. అయితే మ్యాచ్ ముగిసిన తర్వాత రొనాల్డో ఈ ప్రచారంపై స్పందించాడు. తొందపడి ఎప్పుడూ తాను నిర్ణయాలు తీసుకోనని స్పష్టం చేశాడు. 'నేను తొందరపడి ఏ నిర్ణయం తీసుకోను. ఏ విషయంలోనైనా ఈ వరల్డ్‌కప్ ముగిసిన తర్వాతే నిర్ణయం తీసుకుంటా' అని రొనాల్డో రిటైర్మెంట్‌పై క్లారిటీ ఇచ్చాడు. కాగా, తాజా విజయంతో పోర్చుగల్ రౌండ్ ఆఫ్ 16 (ప్రీ క్వార్టర్స్) కు అర్హత సాధించింది. ఇక ప్రీ క్వార్టర్స్‌లో ఆ జట్టు స్పెయిన్ ఢీ కొట్టాల్సి ఉంది. ఈ మ్యాచ్ జులై 07న జరగనుంది. ఇక మ్యాచ్ విషయానికొస్తే, తొలి అర్ధభాగంలో ఏ జట్టు కూడా గోల్ కొట్టలేదు. కానీ అద్భుతమై ఆటతో క్రొయేషియా ఆకట్టుకుంది. రెండో అర్ధభాగం ప్రారంభంలోనే ఇవాన్ పెరిసిచ్ కొట్టిన గోల్‌తో క్రొయేషియా ఆధిక్యంలోకి వచ్చింది. ఆ తర్వాత 68వ నిమిషంలో పెనాల్టీ ద్వారా రొనాల్డో గోల్ సాధించి, స్కోరును సమం చేశాడు. అదనపు సమయంలోని 94వ నిమిషంలో గొంజలో రామోస్ గోల్ సాధించి పోర్చుగల్‌ను విజేతగా నిలిపాడు.

# వైభవ్ ఇంకా వెయిట్ చేయించడం ఎందుకు..?

**• సౌతాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్**



ప్రపంచ క్రికెట్‌లో ప్రస్తుతం టీమిండియా యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ హాట్ టాపిక్‌గా మారిపోయాడు. ఐపీఎల్ 2026లో పరుగుల వరద పారించి.. హేమాహేమీ ప్లేయర్లను సైతం వెనక్కి నెట్టి ఆరెంజ్ క్యాప్ దక్కించుకున్న ఈ బుడ్డోడు.. ఇటీవల ముక్కోణపు సిరీస్‌లోనూ సత్తాచాటాడు. ఇదే జోరులో టీమిండియా టీ20 జట్టు నుంచి పిలుపు అందుకున్నాడు. అయితే జట్టులో చోటు దక్కించుకున్నప్పటికీ.. అతడికి ప్లేయింగ్ లెవెన్‌లో ఆడే అవకాశం రావట్లేదు. ఇటీవల ఐర్లాండ్‌తో ముగిసిన రెండు టీ20లు, ఇంగ్లాండ్‌తో తొలి టీ20లోనూ అతడు బెంచ్‌పైనే కూర్చున్నాడు. ఇదే విషయంపై సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్ మాట్లాడాడు. ముఖ్యంగా అందరు ఆటగాళ్ల మాదిరిగానే అరంగేట్రం విషయంలో వైభవ్ సూర్యవంశీ కూడా వెయిట్ చేయాల్సి ఉంటుందని ఇటీవల టీమిండియా అసిస్టెంట్ కోచ్ డస్కటే చేసిన వ్యాఖ్యలను డివిలియర్స్ వ్యతిరేకించాడు. ప్రస్తుతం అతడి ప్రదర్శన చూశాక.. ఇంకా వెయిట్ చేయించడం ఎందుకని ప్రశ్నించాడు. "వైభవ్ సూర్యవంశీని ఎప్పుడు భారత తుది జట్టులోకి తీసుకుంటారు ఐర్లాండ్‌తో సిరీస్ అతడికి మంచి అవకాశంగా ఉండేది. కానీ అతడిని ఆ సిరీస్‌లో ఆడించలేదు. ఇది దురదృష్టకరం. సూర్యవంశీ కూడా ఇతర ఆటగాళ్ల మాదిరిగానే అరంగేట్ర ప్రక్రియను అనుసరించాల్సిందేనన్న భారత కోచ్‌తో నేను విభేదిస్తున్నాను. ఐపీఎల్‌లో అతడి ఆటను చూశాక.. ఇంకా అతడిని వెయిట్ చేయించడం ఎందుకు వైభవ్‌ను ఐర్లాండ్‌పై ఆడిస్తే బాగుండేది. కాస్త అనుభవం కూడా వచ్చేది కదా" అని ఏబీ డివిలియర్స్ వ్యాఖ్యానించాడు. మరోవైపు టీమిండియా ఓపెనర్ సంజూ శాంసన్ ఇటీవల దారుణంగా విఫలం అవుతున్నాడు. ఐర్లాండ్‌తో 2 మ్యాచ్‌లు, ఇంగ్లాండ్‌తో తొలి టీ20లో సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరిపోయాడు. దీంతో అతడి ప్లేసులో వైభవ్‌కు రెండో టీ20లో చోటు ఇవ్వాలనే డిమాండ్‌లు పెరిగిపోయాయి. అయితే మరికొందరు మాత్రం.. సీనియర్లను తప్పించి కుర్రాడిని ఇప్పుడే ఆడించొద్దని సూచిస్తున్నారు. మరి రెండో టీ20లో అతడికి చోటు ఉంటుందా.. మరోసారి బెంచ్‌కే పరిమితం కావాల్సి వస్తుందా అనేది తేలాల్సి ఉంది.

# మెదక్‌పై నల్గొండ ఘన విజయం

నురాగ్ నల్గొండ నైట్స్ గెలుపు ట్రాక్ ఎక్కింది. గత మ్యాచ్‌లో ఖమ్మం చేతిలో ఓడిన నల్గొండ, తాజాగా మెదక్‌ను చిత్తు చేసింది. ఉప్పల్ వేదికగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో మెదక్‌పై నల్గొండ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మెదక్ నిర్దేశించిన 181 పరుగుల టార్గెట్‌ను నల్గొండ 16.3 ఓవర్లలోనే ఛేదించింది. ఓపెనర్ గౌరవ్ రెడ్డి (101 నాటౌట్) సెంచరీతో ఆకట్టుకున్నాడు. జశ్వంత్ మోతె (34 పరుగులు) ఫర్వాలేదనిపించాడు. మెదక్ బౌలర్లలో అర్జున్, మధుకర్ చెరో 1 వికెట్ పడగొట్టారు. ఓ మోస్తారు ఛేదనను నల్గొండ ఘనంగానే ఆరంభించింది. గౌరవ్ రెడ్డి తొలి నుంచే దూకుడుగా ఆడడంతో పవర్ ప్లేలోనే భారీగా పరుగులు వచ్చాయి. జస్వంత్ కూడా ఆకట్టుకున్నాడు ఈ ఇద్దరు తొలి వికెట్‌కు 40 బంతుల్లోనే 83 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. 6.4 ఓవర్ వద్ద జస్వంత్ ఔట్ అయ్యాడు. అయినా గౌరవ్ జోరు తగ్గలేదు. బౌండరీలు బాదుతూ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. వన్ డౌన్‌లో వచ్చిన నితీశ్ (21) స్వల్ప స్కోరుకే మధుకర్ బౌలింగ్‌లో 12.2 వద్ద ఔటయ్యాడు. కానీ అప్పటికే నల్గొండ గెలుపు ఖాయమైంది. చివర్లో సెంచరీతోపాటు గౌరవ్ మ్యాచ్‌ను కూడా ముగించాడు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన మెదక్ ఫాల్కన్స్ 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసింది. విక్రమ్ నాయక్ (48 పరుగులు నాటౌట్), వరుణ్ ఎర్రమ్ (44 పరుగులు) రాణించారు. శ్రుంజిత్ రెడ్డి



(30 పరుగులు), తెలుకుపల్లి రవితేజ (33 పరుగులు) ఫర్వాలేదనిపించారు. నల్గొండ బౌలర్లలో ఇయాన్ సతాని, చింతల రక్షన్ రెడ్డి, అనికేత్ రెడ్డి తలో 1 వికెట్ దక్కించుకున్నారు. తాజా ఓటమితో మెదక్ టీజీ 20 లీగ్ ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది! ఇప్పటిదాకా ఆరు మ్యాచ్‌లు ఆడిన ఆ జట్టు కేవలం ఒకే దాంట్లో నెగ్గింది. మిగిలిన ఐదు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయి పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉంది. మరోవైపు, నల్గొండ నాలుగో విజయంతో రెండో స్థానంలోకి దూసుకెళ్లింది. ఇప్పటిదాకా ఆరు మ్యాచ్‌లు ఆడిన నల్గొండ రెండు ఓటములు, నాలుగు విజయాలు 8 పాయింట్లతో ప్లేఆఫ్స్‌కు దగ్గరైంది. ఇక ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ 10 పాయింట్లతో టాప్‌లో ఉంది.

# సంజూ శాంసన్ తీవ్రమైన ఒత్తిడి




ఇండియా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ ప్రెజెంట్ కెరీర్ లోనే మోస్ట్ డిఫికల్ట్ ఫేజ్ ను ఫేస్ చేస్తున్నాడు. టీమిండియా మేనేజ్‌మెంట్ అతనిపై నమ్మకం ఉంచినప్పటికీ, బయట నుంచి వస్తున్న విమర్శలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. లాస్ట్ మూడు ఇన్నింగ్స్‌లలో 5, 0, 1 రన్స్ మాత్రమే చేసి దారుణంగా ఫెయిల్ అవ్వడం శాంసన్ పొజిషన్ ను రిస్క్ లో పడేసింది. ఐర్లాండ్‌తో జరిగిన రెండు మ్యాచ్ లతో పాటు ఇంగ్లాండ్‌తో జరిగిన ఫస్ట్ టీ20 మ్యాచ్ లోనూ అతను పూర్తిగా నిరాశపరిచాడు. ఇదే టైమ్‌లో 15 ఏళ్ల బ్యాటింగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ ప్లేయింగ్ ఎలెవన్ లో ఛాన్స్ కోసం వెయిట్ చేస్తుండటంతో శాంసన్ పై ప్రెజర్ నెక్స్ట్ లెవెల్ కు చేరింది. ఈ నేపథ్యంలో ఇండియా మాజీ లు సంజూ శాంసన్ బ్యాటింగ్ లో ఉన్న ఒక మేజర్ టెక్నికల్ లోపాన్ని ఎక్స్ పోజ్ చేశారు.సంజూ శాంసన్ ను అవుట్ చేయడానికి బౌలర్లు ఎలాంటి ప్లాన్ ఫాలో అవుతున్నారో నిపుణులు క్లియర్ గా ఎక్స్ ప్లెయిన్ చేస్తున్నారు. సంజూ బ్యాటింగ్ చేసేటప్పుడు అతని బ్యాట్ ఫేస్ కంప్లీట్‌గా క్లోజ్ అయి ఉంటుందని, అందుకే బౌలర్లు బాల్ ను ఆఫ్ స్టంప్ కు వెలుపల వేయడానికి ట్రై చేస్తున్నారని అంటున్నారు. క్లోజ్డ్ బ్యాట్ ఫేస్ తో ఉన్నప్పుడు అతను ఆఫ్ సైడ్ షాట్లు ఆడటానికి ప్రయత్నించినప్పుడు బ్యాట్ ఫేస్ ఒక్కసారిగా ఓపెన్ అవుతుందని, ఈ టెక్నికల్ ఫ్లా వల్లే అతను వికెట్లు పారేసుకుంటున్నాడని మాజీ ఆల్ రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ స్పష్టం చేశాడు. ఐర్లాండ్ తో జరిగిన ఫస్ట్ మ్యాచ్ లో బాల్ ను ఆన్ ది అప్ ఆడబోయి ఇన్‌సైడ్ ఎడ్జ్ తో క్లీన్ బౌల్డ్ అయ్యాడని, ఇంగ్లాండ్ పై జరిగిన మ్యాచ్ లోనూ ఆఫ్ స్టంప్ అవతలి బాల్ ను అనవసరంగా కెలుక్కుని థర్డ్ మ్యాన్ లో క్యాచ్ ఇచ్చాడని పఠాన్ విశ్లేషించాడు.మరో ఎండ్ లో బిహార్ కు చెందిన 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ ఇంటర్నేషనల్ డెబ్యూ కోసం క్రికెట్ లోకమంతా ఈగర్‌గా వెయిట్ చేస్తోంది.

# నాగబంధం గ్రాఫిక్స్ హైలెట్

## కథా కథనంలో కనిపించని పట్టు

సినిమా నిర్మాణ దశ నుంచే తెలుగు ఆడియెన్స్‌లో ఎంతో ఆసక్తిని రేకెత్తించిన చిత్రం నాగబంధం. భారీ గ్రాఫిక్ హంగులతో విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. డివైన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో విరాట్ కర్ణ హీరోగా నటించగా, అభిషేక్ నామా దర్శకత్వం వహించారు. భారీ అంచనాలతో ఈ సినిమా శుక్రవారం విడుదలై ప్రేక్షకులను మెప్పించింది. అనాథ అయిన రుద్ర (విరాట్ కర్ణ)ను పద్మమ్మ (శరణ్య) చేరదీసి సొంత కొడుకులా పెంచుతుంది. తన చెల్లెలి (సోనియా సింగ్) పెళ్లిని రాజు అనే యువకుడితో ఘనంగా చేయాలని రుద్ర అనుకుంటాడు. సరిగ్గా పెళ్లి సమయంలో రంగనాథ స్వామి ఆలయంలోని బ్రహ్మకమలం కోసం రుద్ర కుటుంబంపై జుల్ఫికర్ అలీ (రిషబ్) దాడి చేస్తాడు. ఈ ప్రమాదంలో రుద్ర ఫ్యామిలీలోని అందరూ చనిపోతారు. వేల ఏళ్లుగా రంగనాథ స్వామి ఆలయంలో పూజలందుకుంటున్న బ్రహ్మకమలంతో రుద్రకు ఉన్న సంబంధం ఏమిటి? ఆ బ్రహ్మకమలాన్ని దొంగతనం చేయాలని ఆర్కియాలజిస్ట్ ప్రభాకర్ (జగపతిబాబు)తో పాటు అతని కూతురు పార్వతి (నభా నటేష్) ఎలాంటి ప్రయత్నాలు చేశారు? ఆలయంలోని బ్రహ్మకమలం, గరుడ మంత్రాలతో పాటు నాగబంధం గ్రంథం సాయంతో అమరత్వం పొందాలని జుల్ఫికర్ అలీ, భైరాగి (గరుడ రామ్) ఎలాంటి మారణహోమానికి పాల్పడ్డారు? కైలాస పర్వతంలోని విరాటస్వామి ఆలయంలోని ఓ గదిలో ఉన్న రహస్యం ఏమిటి? 17వ శతాబ్దంలో హిందూ దేవాలయాలను దోచుకున్న అబ్దాలీని నాగసాధువు ఎలా నిలువరించాడు? అన్నదే నాగబంధం మూవీ కథ. కేరళలోని అనంత పద్మనాభ స్వామి ఆలయానికి నాగబంధం రక్షణగా ఉందనే కథ ప్రచారంలో ఉంది. ఆ నాగబంధాన్ని విచ్ఛిన్నం చేయాలంటే గరుడ మంత్రాలు తెలిసి ఉండాలని పురాణాల్లో రాసి ఉంది. ఈ పాయింట్ నుంచే దర్శకుడు అభిషేక్ నామా స్ఫూర్తి పొంది నాగబంధం కథను రాసుకున్నారు. ఈ చిన్న పాయింట్‌కు సనాతన ధర్మం, హైందవ సంస్కృతితో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్, లవ్‌స్టోరీని జోడించి సినిమాను రూపొందించారు. నాగబంధం విముక్తి కోసం ప్రయత్నించే అసాంఘిక శక్తులు, దేవుడి అండతో వారిని ఎదుర్కొనే సామాన్యుడైన హీరో.. ఈ అంశాల చుట్టే నాగబంధం కథ సాగుతుంది. ప్రతి ఫ్రేమ్ కలర్‌ఫుల్‌గా ఉంటుంది.




అబ్బురపరిచే సెట్స్, అదిరిపోయే గ్రాఫిక్స్ లార్జర్ దేన్ లైఫ్‌లాంటి అనుభూతిని అందిస్తాయి. యాక్షన్ ఎపిసోడ్స్ బాగున్నాయి. భైరవకోన ఎపిసోడ్, మానసాదేవి టెంపుల్‌లో జరిగే ఫైట్‌తో పాటు అబ్దాలీ మనుషులకు, నాగసాధువులకు మధ్య జరిగే వార్ సీన్లు గూస్‌బంప్స్ కలిగిస్తాయి. అయితే యాక్షన్ సీక్వెన్స్‌లు సుదీర్ఘంగా సాగడం మాత్రం సినిమాకు మైనస్‌గా మారింది. నాగబంధం కథను మొదలుపెట్టిన తీరు బాగుంది. ఫ్యామిలీ సీన్లు కథకు పెద్దగా అతకలేదు. కథ మొత్తం బ్రహ్మకమలం చుట్టే తిరగడంతో సాగదీసిన ఫీలింగ్ కలుగుతుంది. రెండు డిఫరెంట్ షేడ్స్‌తో సాగే పాత్రలో హీరోగా విరాట్ కర్ణ మెప్పించాడు. నాగసాధువుగా అతని లుక్ బాగుంది. యాక్షన్ సన్నివేశాల్లో మెప్పించినా, ఎమోషనల్ సీన్ల పరంగా ఇంకా పరిణితి చూపించాల్సి ఉంది. నభా నటేష్‌కు మంచి రోల్ దక్కింది. పాజిటివ్, నెగెటివ్ కోణాల్లో ఆమె పాత్ర సాగుతుంది. కొద్దిసేపు డ్యూయల్ రోల్‌లో కనిపిస్తుంది. విలన్‌గా రిషబ్ డైలాగ్ డెలివరీ, బాడీలాంగ్వేజ్ విభిన్నంగా ఉన్నాయి. మరో హీరోయిన్ ఐశ్వర్య మీనన్‌కు ఒకటి రెండు డైలాగ్స్ తప్ప పెద్దగా ఇంపా÷-టర్గ÷న్స్ లేదు. జగపతిబాబు, మురళీ శర్మ, మహేష్ మంజ్రేకర్, శరణ్య, అనసూయ, సోనియా సింగ్, అంకిత్ కొయ్యతో పాటు సినిమాలో చాలామందే యాక్టర్లు కనిపిస్తారు కానీ, తమ నటనను చాటిచెప్పే అవకాశం ఎవరికీ దక్కలేదు. విజువల్స్, గ్రాఫిక్స్ పై పెట్టిన శ్రద్ధ కథపై కూడా పెట్టి ఉంటే నాగబంధం రిజల్ట్ మరోలా ఉండేది. చిన్న చిన్న లోపాలున్నా నాగబంధం ప్రేక్షకులను కొంతవరకు మెప్పిస్తుంది.

# ఆసక్తికరంగా సాగిన రావు బహదూర్

'కేరాఫ్ కంచరపాలెం', 'ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య' లాంటి విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకుల్ని మెప్పించిన దర్శకుడు వెంకటేశ్ మహా. ఇప్పుడాయన సత్యదేవ్‌తో కలిసి చేసిన ప్రయోగాత్మక చిత్రం 'రావు బహదూర్'. దీనికి మహేశ్‌బాబు స్వయంగా సమర్పకుడిగా వ్యవహరించడం.. ఇందులో సత్యదేవ్ భిన్న గెటప్పుల్లో కనిపించనుండటం.. టీజర్, ట్రైలర్లు ఆసక్తిరేకెత్తించేలా ఉండటంతో ప్రేక్షకుల్లో ఈ సినిమాపై మంచి అంచనాలేర్పడ్డాయి. 1968 – 1991 మధ్య కాలంలో సాగే కథ ఇది. రామప్ప రావు బహదూర్ (సత్యదేవ్) ఓ రాజవంశీకుడు. కాలేయ క్యాన్సర్‌తో పోరాడుతూ జీవిత చరమాంకంలో ఉంటాడు. అతను కొన్ని నెలలకు మించి బతకడని డాక్టర్లు చెప్పినప్పటికీ.. వాళ్ల అంచనాల్ని తలకిందులు చేస్తూ నిక్షేపంగా జీవిస్తుంటాడు. అయితే, తీవ్రమైన మానసిక రుగ్మతలతో సతమతమవుతుంటాడు. ముఖ్యంగా అతన్ని ఓ అనుమానం పెనుభూతంలా పట్టిపీడిస్తుంటుంది. దాన్ని తీరిస్తే చాలు.. సంతోషంగా ప్రాణం వదిలేస్తానని తన మిత్రుడు, వ్యక్తిగత వైద్యుడు ఆచారి (వికాస్ ముప్పాల) దగ్గర మాట తీసుకుంటాడు. మరి అతనికున్న ఆ అనుమానమేంటి? దానివల్ల అతని చుట్టూ ఉన్న వాళ్లని ఎన్ని రకాలుగా ముప్పుతిప్పలు పెట్టాడు? అసలు రామప్ప గతమేంటి? రేణుక (దీపా థామస్)తో ప్రేమ, పెళ్లి ప్రయాణం ఎలా సాగింది? ఆమెకి దూరంగా రామప్ప ఒంటరిగా జీవించడానికి వెనకున్న కారణమేంటి? అన్నది సినిమా కథ. ఇదొక విభిన్నమైన సైకలాజికల్ డ్రామా. జీవిత చరమాంకంలో ఉన్న ఓ రాజవంశీకుడు తనకున్న అనుమానం అనే జబ్బుతో చుట్టూ ఉన్న వాళ్లని సైకలాజికల్‌గా ఆడుకుంటూ తన కోరికని ఎలా నెరవేర్చుకున్నాడన్నది క్లుప్తంగా ఈ చిత్ర కథాంశం. పైకిది ఓ రాజవంశ కథలా కనిపించినా.. అంతర్లీనంగా సమాజంలో తరతరాలుగా గూడుకట్టుకుపోయిన వివక్షాపూరిత వ్యక్తిత్వాల గురించి చర్చిస్తుంది. ప్రధానంగా కుల వ్యవస్థ, రంగు, రక్తసంబంధాలు, వారసత్వ హోదాపై ఉన్న పిచ్చిని ఈ చిత్రం బలంగా ప్రశ్నిస్తుంది. కానీ, ఈ సినిమాతో దర్శకుడు వెంకటేశ్ మహా చెప్పాలనుకున్న విషయం ఆలోచన రేకెత్తించేదే అయినా.. దాన్ని ఆద్యంతం జనరంజకంగా మలచడంలో అక్కడక్కడా తడబడ్డారు. ఓ ఫొటో ఫ్రేమ్ నుంచి బయటకొచ్చిన పిల్లాడిని ఊడలు తరుముకుంటూ రావడం.. తనని తిరిగి సమాధిలో బంధించడం.. కట్ చేస్తే మంచం పట్టిన స్థితిలో వృద్ధ పాత్రలో హీరోని పరిచయం చేయడం.. ఇలా




ఆరంభ సన్నివేశాలు ఏదో కొత్త కథని, కొత్త ప్రపంచాన్ని చూడబోతున్నామన్న ఆసక్తిని కలిగించేలా చేస్తాయి. కానీ, సినిమాలో వేగం కనిపించదు. ప్రేక్షకుడికి అసలు కథేంటన్నది అంతుచిక్కడానికి విరామం వరకు వేచి చూడాల్సి వస్తుంది. భువనాలయ ప్రపంచం.. అందులోని రావు బహదూర్ జీవితం.. అతని గతం.. రేణుకతో ప్రేమాయణం అన్నీ నెమ్మదిగా సాగిపోతుంటాయి. హీరో ఎప్పుడైతే తన అనుమానం తీర్చుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెడతాడో అక్కడి నుంచే కథలో సంఘర్షణ రెట్టింపవుతుంది. ఈ క్రమంలో వచ్చే విరామ సన్నివేశాలు ద్వితీయార్ధంపై ఆసక్తిని పెంచేలా ఉంటాయి. ఇక సెకండాఫ్ మొదలైనప్పటి నుంచి కథ కాస్త గాడిన పడిన అనుభూతి కలుగుతుంది. హీరో గతం.. చిన్న కొడుకుపై వివక్ష చూపించడానికి వెనకున్న కారణం.. దాని చుట్టూ నడిపిన డ్రామా అన్నీ ఆకట్టుకుంటాయి. ఇక ఈ కథలోకి పోలీస్ పాత్ర ఎప్పుడైతే ఎంట్రీ ఇస్తుందో.. అక్కడి నుంచి సినిమా ఇంకాస్త ఆసక్తికరంగా మారుతుంది.




# సమంత నటన అద్భుతం..

## 'మా ఇంటి బంగారం'పై అఖిల్ అక్కినేని ప్రశంసలు

అక్కినేని యువ కథానాయకుడు అఖిల్, టాలీవుడ్‌లో ఇటీవల ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన 'మా ఇంటి బంగారం' చిత్రంపై, అందులో సమంత నటనపై ప్రశంసల వర్షం కురిపించారు. ప్రస్తుతం తాను హీరోగా నటిస్తున్న 'లెనిన్' సినిమా ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒకరి విజయాన్ని మరొకరు గౌరవించుకోవడం పట్ల ఇండస్ట్రీ వర్గాలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.వివరాల్లోకి వెళితే.. తన 'లెనిన్' సినిమా ప్రచార కార్యక్రమాలతో బిజీగా ఉండటం వల్ల 'మా ఇంటి బంగారం' చిత్రాన్ని ఇంకా పూర్తిగా చూడలేదని అఖిల్ తెలిపారు. అయితే, ఆ సినిమా ట్రైలర్ చూశానని, దాని వైబ్ అద్భుతంగా ఉందని అన్నారు. "ట్రైలర్ చూడగానే ఈ సినిమా కచ్చితంగా పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం కలిగింది. ఒక మంచి కోడలు తన అత్తారింటి మనసులు గెలుచుకోవాలనే సున్నితమైన ఫ్యామిలీ పాయింట్‌కు, పవర్‌ఫుల్ యాక్షన్‌ను జోడించి చాలా సహజంగా తెరకెక్కించారు" అని చిత్ర బృందాన్ని మెచ్చుకున్నారు.ముఖ్యంగా ఒక మహిళా ప్రధాన పాత్రతో అంత భారీ స్థాయిలో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించడం గొప్ప విషయమని అఖిల్ కొనియాడారు. ఈ చిత్రంలో సమంత తన పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయిందని ప్రశంసించారు. ఈ సందర్భంగా "కంగ్రాట్స్ సామ్" అంటూ సమంతకు, చిత్ర యూనిట్‌కు ప్రత్యేకంగా తన అభినందనలు తెలియజేశారు. నాగచైతన్యతో విడాకుల తర్వాత కూడా అక్కినేని కుటుంబ సభ్యులతో సమంతకు, ముఖ్యంగా అఖిల్‌తో ఉన్న స్నేహపూర్వక సంబంధం, వృత్తిపరమైన గౌరవం మరోసారి బయటపడింది. ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ముందుకు సాగుతున్న తీరు అందరినీ ఆకట్టుకుంటోంది. ఇక అఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న 'లెనిన్' చిత్రం జులై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# జయకృష్ణ ఘట్టమనేని 'శ్రీనివాస మంగాపురం' రిలీజ్ డేట్ ఫిక్స్



సూపర్ స్టార్ మహేశ్ బాబు సోదరుడి కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ జూలై 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్నట్లు శుక్రవారం వెల్లడించింది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ హీరోయిన్‌గా నటిస్తూ టాలీవుడ్‌కు పరిచయమవుతోంది.'RX 100', 'మంగళవారం' వంటి విజయవంతమైన చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తిరుపతి నేపథ్యంలో సాగే ఓ ఇంటెన్స్ లవ్‌స్టోరీగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. స్నేహితులుగా ఉండి ప్రేమికులుగా మారిన వాసుబాబు, మంగల కథ ఇది. వారి ఆనందమయ జీవితంలోకి ఓ ఊహించని సంఘర్షణ ఎదురైనప్పుడు ఏం జరిగిందనేదే కథాంశం. తనదైన శైలిలో యాక్షన్, డ్రామా జోడించి అజయ్ భూపతి ఈ ప్రేమకథను తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది



# 'గుర్తుకొస్తున్నాయి' సిరీస్‌కు ఐకాన్ స్టార్ అండ..

## నిర్మాతగా మారిన మిత్రుడికి బన్నీ ఎమోషనల్ విషెస్

'బేబీ' చిత్రంతో యువతలో మంచి క్రేజ్ సంపాదించుకున్న విరాజ్ అశ్విన్, యశశ్రీ రావు జంటగా నటించిన వెబ్ సిరీస్ 'గుర్తుకొస్తున్నాయి'. ఫీల్ గుడ్ స్కూల్ డేస్ జ్ఞాపకాల నేపథ్యంలో తెరకెక్కిన ఈ సిరీస్, జులై 3 నుంచి 'ఈటీవీ విన్' ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ సిరీస్‌కు సానుకూల స్పందన వస్తున్న తరుణంలో, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ చిత్ర బృందానికి తన మద్దతు తెలుపుతూ సోషల్ మీడియాలో ఒక ప్రత్యేక పోస్ట్ పెట్టారు. ఇది ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది.ఈ సిరీస్ ద్వారా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శరత్ చంద్ర నాయుడు పూర్తిస్థాయి నిర్మాతగా పరిచయమయ్యారు. గతంలో 'చావు కబురు చల్లగా', 'వినరో భాగ్యము విష్ణు కథ' వంటి చిత్రాలకు పనిచేసిన శరత్‌తో ఉన్న అనుబంధం దృష్ట్యా అల్లు అర్జున్ ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా బన్నీ ఒక ఎమోషనల్ పోస్ట్ చేశారు.

"'గుర్తుకొస్తున్నాయి' సిరీస్ గురించి చాలా అద్భుతమైన విషయాలు వింటున్నాను. నా ప్రియమైన శరత్ చంద్రకు, చిత్ర యూనిట్ మొత్తానికి నా హృదయపూర్వక అభినందనలు. నువ్వు ఒక నిర్మాతగా నీ మొదటి అడుగు వేయడం చూడటం నాకు ప్రత్యేకంగా చాలా సంతోషాన్ని ఇస్తోంది. ఈ అందమైన సిరీస్ ప్రేక్షకుల ప్రేమాభిమానాలు, ప్రశంసలతో పాటు గొప్ప విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. చిత్ర తారాగణానికి, సాంకేతిక నిపుణులందరికీ నా శుభాకాంక్షలు. ఈ సిరీస్‌ను ఈటీవీ విన్‌లో చూడటానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని బన్నీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

వినోద్ గాలి దర్శకత్వం వహించిన ఈ సిరీస్, స్కూల్ రోజుల నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేస్తూ యువతను, కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. వెబ్ సిరీస్‌గా వచ్చిన కంటెంట్‌కు అల్లు అర్జున్ వంటి అగ్ర నటుడి




నుంచి ప్రశంసలు, మద్దతు లభించడం చిత్ర యూనిట్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. బన్నీ పోస్ట్‌తో ఈ సిరీస్‌పై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి పెరిగింది. ఐకాన్ స్టార్ నుంచి లభించిన ఈ మద్దతుకు చిత్ర బృందం ఆనందం వ్యక్తం చేస్తోంది



# ఎఐ సాయంతో డీప్‌ఫేక్ చిత్రాలు

## బాంబే హైకోర్టును ఆశ్రయించిన ప్రీతిజింతా

బాలీవుడ్ ప్రముఖ నటి ప్రీతి జింతా బాంబే హైకోర్టును ఆశ్రయించింది. తన అనుమతి లేకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత వాడి సృష్టించిన డీప్‌ఫేక్ చిత్రాలు, మార్ఫింగ్ చేసిన అసభ్యకర కంటెంట్‌కు వ్యతిరేకంగా ఆమె కోర్టుకు వెళ్లింది. ఈ కంటెంట్‌ను ఇంటర్నెట్ నుండి పూర్తిగా తొలగించేలా అత్యవసర ఆదేశాలు ఇవ్వాలని ఆమె కోర్టును కోరారు. ఇక ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ మాధవ్ జామదార్.. కంటెంట్‌ను వెబ్‌సైట్ల నుండి తొలగించడానికి ఒక సులువైన విధానాన్ని రూపొందించాలని ఇరు పక్షాలకు సూచించింది. కాగా దీనిపై తదుపరి విచారణ జూలై 6న జరగనుంది. ప్రీతి జింతా దాఖలు చేసిన ఈ వ్యాజ్యంలో గూగుల్, మెటా వంటి సోషల్ మీడియా సంస్థలతో పాటు డొమైన్ నేమ్ రిజిస్ట్రార్లను ప్రతివాదులుగా చేర్చారు. నటి తరఫు సీనియర్ అడ్వకేట్ వెంకటేష్ ధోండ్ వాదనలు వినిపిస్తూ.. రోజురోజుకూ ఈ డీప్‌ఫేక్స్ నాణ్యత పెరుగుతోందని, అందువల్ల తక్షణమే సదరు లింకులను తొలగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. మరోవైపు గూగుల్, మెటా సంస్థల తరఫు న్యాయవాదులు స్పందిస్తూ.. వివాదాస్పద లింకులను తొలగించడానికి తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, అయితే సాధారణ చట్టబద్ధమైన కంటెంట్‌ను ముందస్తుగా పర్యవేక్షించి బ్లాక్ చేయాలనే నిబంధనలు విధించవద్దని కోర్టును అభ్యర్థించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. సాధారణ కంటెంట్‌కు ఇబ్బంది లేకుండా, కేవలం అభ్యంతరకర లింకులను మాత్రమే తొలగించేలా ఒక ప్రాక్టికల్ ప్రోటోకాల్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613